## నీలగిరి నిత్యపద్యం

న్యస్తాక్షరి:- రా,మా,ను,జ

ఆటవెలది

(రా) మకార్యమునను రావణుకోటకు
(మా)రుతి వెడలేను మాత కొరకు
(తా)ను కనుగొనెనట జానకి దేవిని
(జ)యము తోడ వచ్చె జంకులేక

మీ

విజయ్రప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు
రాష్ట్రప్రభుత్వ ఉత్తమకవి పురస్కారగ్రహీత



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 331 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 21-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# రూ.3,24,234 కోట్లతో
# రాష్ట్ర బడ్జెట్

ఆరు గ్యారంటీల అమలుకు..
రూ.50,713 కోట్లు

1.15 కోట్ల కుటుంబాలకు
రూ.5 లక్షలతో జీవిత బీమా

ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు,
చేయూత పథకం.. రూ.14,861 కోట్లు,
రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు








- జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయింపు
- విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయింపు
- వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు
- విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు
- పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు
- పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు
- విద్యా శాఖకు రూ.26,674 కోట్లు
- వైద్య శాఖకు రూ.13,679 కోట్లు
- కార్మిక శాఖకు రూ.998 కోట్లు
- మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు
- ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు,
- ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు
- బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు
- మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు
- ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు
- యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు
- మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు
- అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, మార్చి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 తెలంగాణ బ్జడెట్‌లో 'ప్రజా క్షేమం సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌళిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని -మిగతా 2 లో

| బడ్జెట్ (రూ. కోట్లలో) | రెవెన్యూ వ్యయం | మూలధన వ్యయం |
|---|---|---|
| 3,24,234 | 2,34,406 | 47,267 |



## పిరికిపందలు..
## మిమ్మల్ని గుర్తు పెట్టుకుంటాం..!

- అమెరికా సహాయం లేకపోతే నాటో ఒక 'కాగితపు పులి'
- వందల బిలియన్ల ఖర్చు.. బదులుగా శూన్యం
- నాటోపై ట్రంప్ నిప్పులు:

న్యూఢీల్లీ
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి నాటో సభ్య దేశాలపై మండిపడ్డారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడానికి తమతో కలిసి రానందుకు నాటోను ఒకే వైపున్న వీధిగా అభివర్ణించిన ట్రంప్.. ఈసారి పిరికిపందలుగా పేర్కొన్నారు. శుక్రవారం తన సోషల్ మీడియా పోస్టుల్లో పిరికిపందలారా.. మిమ్మల్ని గుర్తు పెట్టుకుంటాం అని నాటో దేశాలపై ట్రంప్ తన అక్కసు వెళ్లగక్కారు.ఇజ్రాయేల్‌తో కలిసి ఇరాన్‌పై యుద్ధానికి దిగిన డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రపంచ దేశాల నుంచి మద్దతు కరువవుతోంది. అంతర్జాతీయ జల రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడంలో నాటో దేశాల సాయం కోరిన అమెరికా అధ్యక్షుడికి చుక్కెదురైంది. ఇరాన్‌పై చేస్తున్న యుద్ధంలో తాము పాల్గొనబోమని ఆయా దేశాలు స్పష్టం చేశాయి. దాంతో, చిర్రెత్తుకొచ్చిన ట్రంప్ మాకు ఎవరి సాయం అక్కర్లేదు అని నాటో దేశాలకు తేల్చి చెప్పారు.
చమురు ధరలు పెరుగడంపై ఆందోళన -మిగతా 2 లో

## ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే
# ముందుకు

హరీస్ రావుకు ట్యాపింగ్‌లో ఊరట అబద్ధం

- పదో తరగతి పరక్షలు లేకుండా 12 తరగతులు
- తెలంగాణ విద్యారంగంలో కీలక మార్పులకు కసరత్తులు
- కమిటీ అధ్యయనం తరవాత విస్తృతస్థాయిలో ప్రజాభిప్రాయం
- మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పలు చేశాం
- రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం అప్పలకు చెల్లించాం
- కెసిఆర్‌ను గృహనిర్బంధం చేసిన కేటిఆర్, హరీష్ రావు
- హిల్టు టీడీఆర్ భూ బదలాయింపులపై ఎలాంటి విచారణకైనా సిద్ధం
- డ్రగ్స్‌పై నోరుమెదపని బిజెపి, బిఆర్ఎస్ నేతలు
- మీడియతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్ మార్చి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఫోన్ ట్యాపింగ్ విషయంలో చట్టప్రకారమే ముందుకు వెళు_న్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో దర్యాప్తు 20 నెలలు ఆలస్యమైందన్నారు. ఇందులో అరెస్టులు తప్పవని కూడా అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ దొరికినా.. భాజపా నేతలు మాట్లాడటం లేదని, బీఆర్ఎస్, భాజపా కలిసి ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమని చెప్పారు. -మిగతా 2 లో




## ఆరు గ్యారెంటీలకు
## సమాధి కట్టారు

- బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం
- మహిళల పెన్షన్‌పై మాట్లాడని బడ్జెట్
- పేదలపట్ల చిత్తశుద్ధి లేని బడ్జెట్ ఇది
- భట్టి కేటాయింపులపై హరీష్ రావు పెదవివిరుపు

హైదరాబాద్ మార్చి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణ బడ్జెట్‌పై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు పెదవి విరిచారు. ఇదొక ఝూటా బ్జడెట్ అని, బోగస్ బడ్జెట్ అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను, ఆర్టీసీ కార్మికుల సమస్యలను, నిరుద్యోగల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన పించన్ పెంపు హామీలను కూడా సర్కారు మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ. -మిగతా 2 లో

## ఇంటి పని, వంట పని
## చేయకపోతే క్రూరత్వం కాదు..

- పెళ్లి చేసుకునేది పనులు చేయించుకోవడానికి కాదు, భాగస్వామి కోసం.
- భర్తలు కూడా వంట, ఇంటి పనుల్లో సాయపడాలి.
- భార్య ఇంటి పనుల విషయంలో సుప్రీంకోర్టు వ్యాఖ్య



న్యూఢీల్లీ
భార్య ఇంటి పని, వంట పని చేయనంత మాత్రాన అది క్రూరత్వం కిందకు రాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అంతేకాదు ఒక మహిళను పెళ్లి చేసుకునేది పనులు చేయడం కోసం మాత్రమే కాదని అభిప్రాయపడింది. జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ విక్రమ్ నాథ్ ఆధ్వర్యంలోని సుప్రీం ధర్మాసనం ఈ కేసును విచారించి, తాజా వ్యాఖ్యలు చేసింది. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తనను, కుటుంబ సభ్యుల్ని చూసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తోందని, ఈ నేపథ్యంలో ఆమె నుంచి విడాకులు కావాలని కోరుతూ ఒక వ్యక్తి ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు.కేసు వివరాలకు సంబంధించి.. ఒక జంట 2017లో పెళ్లి చేసుకున్నారు. వారికి ఎనిమిదేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. -మిగతా 2 లో

## బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు...ప్రగల్భాలు



- అప్పలకోసం చేసే ప్రయత్నాలే ఎక్కువ
- బడ్జెట్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

హైదరాబాద్,మార్చి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదాయాన్ని పండబెట్టి.. అప్పుల కోసం అర్రులు చాచే బ్జడెట్ ఇది అంటూ -మిగతా 2 లో

## జాబ్ ఫస్ట్ అనేది
## కూటమి లక్ష్యం

- 20లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం
- ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీ
- మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్లు
- ఉగాది ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు వెల్లడి



అమరావతి మార్చి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఏటా ఉగాది రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేరుస్తామని అన్నారు.ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీచేసేందుకు ఈసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు. మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్ల ద్వారా -మిగతా 2 లో



## అమెరికాకు
## షాకిచ్చిన శ్రీలంక..

- యుద్ధ విమానాలు దిగేందుకు అనుమతి నిరాకరణ
- తాము యుద్ధ సమయంలో తటస్థ వైఖరి అవలంభిస్తామని అమెరికాకు శ్రీలంక స్పష్టం

న్యూఢీల్లీ
ఇరాన్‌తో యుద్ధం వేళ అమెరికాకు శ్రీలంక షాకిచ్చింది. తమ దేశానికి చెందిన రెండు యుద్ధ విమానాల్ని ల్యాండ్ చేసేందుకు అంగీకరించాలంటూ అమెరికా చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. తాము యుద్ధ సమయంలో తటస్థ వైఖరి అవలంభిస్తామని అమెరికాకు శ్రీలంక స్పష్టం చేసింది. ఈ మేరకు శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే శుక్రవారం అక్కడి పార్లమెంట్‌లో దీనిపై ప్రకటన చేశారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. అమెరికాకు చెందిన రెండు యుద్ధ విమానాలు ఆఫ్రికాలోని డిబౌటి పట్టణంలో ఉన్నాయి.ఈ విమానాలు ఒక్కొ దాంట్లో ఎనిమిది యాంటీ షిప్ మిస్సైల్స్ ఉన్నాయి. ప్రస్తుతం ఇరాన్‌తో యుద్ధం జరుగుతున్న వేళ వాటిని వ్యూహాత్మకంగా వాడేందుకు శ్రీలంకకు తీసుకురావాలనుకుంది. ఇందుకోసం ఆయుధాలతో కూడిన ఈ విమానాల్ని శ్రీలంకలోని మట్టాలా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేస్తామని, ఇందుకు అనుమతించాలని అమెరికా కోరింది. ఈ నెల ప్రారంభంలో ఈ అంశంపై శ్రీలంక అధ్యక్షుడు దిస్సనాయకేతో అమెరికాకు -మిగతా 2 లో

## పిరికిపందలు.. మిమ్మల్ని గుర్తు పెట్టుకుంటాం..!

మొదటి తరువాయి

వ్యక్తం చేస్తున్న ఈ దేశాలపై శుక్రవారం మరోసారి ట్రంప్ విరుచుకుపడ్డారు. చమురు, గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని నాటో దేశాలు గగ్గోలు పెడుతున్నాయి. కానీ, హర్మూజ్ జల సంధిని తెరచి ఉంచేందుకు మాత్రం మాతో కలిసి రావడం లేదు. అమెరికా లేకుండా నాటో సంస్థ కాగితంపై మాత్రమే పులి' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. జపాన్ సహా కొన్ని యూరోపియన్ దేశాలు మాత్రం హర్మూజ్ జలసంధిని సంరక్షించేందుకు ముందుకొచ్చాయి. 'నాటోలోని కొన్ని దేశాల రక్షణ కోసం అమెరికా ఏటా కొన్ని వందల కొద్ది బిలియన్ డాలర్లను ఖర్చు చేస్తోంది. కానీ, బదులుగా అమెరికాకు ఈ దేశాలు ఏమీ చేయడం లేదు. ఇరాన్ సైన్యాన్ని అమెరికా నాశనం చేసింది. ఆ దేశ నావికా దళం, వాయుసేన, నాయకత్వాన్ని దెబ్బతీశాం. ఇప్పటివరకూ ప్రపంచంలోనే అమెరికా శక్తివంతమైన దేశం. మాతో కలిసి వచ్చేందుకు నిరాకరిస్తున్న నాటో దేశాలు చాలా తెలివితక్కువ పొరపాటు చేస్తున్నాయి.ఒకవేళ ఈ దేశాలు అంగీకరించినా ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకునేందుకు, కీలకమైన జల రవాణాను ఏర్పరచుకునేందుకు మేము అనుమతించే వాళ్లం కాదు' అని ట్రంప్ వెల్లడించారు. ఇప్పటికే ఇరాన్‌పై దాడుల్లో అమెరికా సైన్యం విజయవంతమైందని, తమకు నాటో దేశాల సాయం అవసరం లేదని ట్రంప్ తేల్చి చెప్పారు. అంతేకాదు తమకు జపాన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా సైతం సాయం చేయనక్కర్లేదని ఆయన పేర్కొన్నారు.

## ఇంటి పని, వంట పని చేయకపోతే క్రూరత్వం కాదు..

మొదటి తరువాయి

పెళ్లైన వారం తర్వాత నుంచి భార్య ప్రవర్తనలో మార్పు వచ్చిందని భర్త ఆరోపించాడు. తనను సరిగ్గా చూసుకోవడం లేదని, వంట చేయడం లేదని ఆరోపించాడు. అలాగే, తన తల్లిదండ్రుల్ని కూడా అసభ్య పదజాలంతో తిడుతోందన్నాడు. తనకు కొడుకు పుట్టినా, నామకరణానికి కూడా తనను, కుటుంబ సభ్యుల్ని ఆహ్వానించలేదని కోర్టుకు తెలిపాడు. అందువల్ల ఆమె నుంచి విడాకులు కావాలని కోరాడు. దీనిపై భార్య స్పందించింది. తను ప్రెగ్నెన్సీ సమయంలో భర్త, అత్తవారింటి అనుమతితోనే డెలివరీకి పుట్టింటికి వెళ్లానని, నామకరణానికి పిలిచినా వాళ్లు రాలేదని తెలిపింది. నగలు, డబ్బు కావాలని డిమాండ్ చేసినట్లు తెలిపింది. ఇరువురి వాదనలు విన్న ఫ్యామిలీ కోర్టు మధ్యవర్తిత్వానికి ఆదేశించింది. ఇరువురికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో భర్త విజ్ఞప్తి మేరకు ఇరువురికి ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసింది. కానీ, ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన విడాకుల్ని సవాలు చేస్తూ భార్య హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన హైకోర్టు.. ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన విడాకులపై స్టే విధించింది. దీంతో భర్త హైకోర్టు ఆదేశాల్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంలో వాదనలు జరిగాయి. తను పెళ్లి చేసుకుంది పని మనిషిని కాదని, జీవిత భాగస్వామిని అనే విషయం గుర్తు పెట్టుకోవాలని భర్తకు సూచించింది. భార్య ఇంటి పనులు చేయనంత మాత్రాన క్రూరత్వంగా భావించలేమని తెలిపింది. అంతేకాదు.. ఇది పాత కాలం కాదని, కొత్త తరం అని, అందువల్ల భర్తలు కూడా వంట చేయడం, బట్టలు ఉతకడంలో సాయపడాలని సూచించింది. తదుపరి విచారణ సందర్భంగా ఇరువురూ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది.

## అమెరికాకు షాకిచ్చిన శ్రీలంక..

మొదటి తరువాయి

చెందిన సౌత్, సెంట్రల్ ఆసియా ప్రతినిధి సెర్గియో గోర్ చర్చలు జరిపారు. ఈ నెల 4న శ్రీలంకలో విమానాల్ని ల్యాండ్ చేసేందుకు అనుమతించాలని కోరారు. కానీ, దీనికి అధ్యక్షుడు దిస్స నాయకే నో చెప్పారు. తాము ఈ యుద్ధ సమయంలో తటస్థంగానే ఉండదలిచామని దిస్సనాయకే తెలిపారు. మిడిల్ ఈస్ట్ యుద్ధం సమయంలో ఎంత ఒత్తిడి ఎదురైనా తటస్థంగానే ఉన్నామని, ఈ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని ఆయన స్పష్టం చేశారు.అమెరికాతో చర్చల సందర్భంగా సముద్ర మార్గాల రక్షణ, పోర్టుల భద్రత, వ్యాపార, వాణిజ్య రంగాల్లో సహకారం వంటి అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు దిస్సనాయకె తెలిపారు. ఇక, ఈ విమానాలు ల్యాండ్ అవ్వాల్సిన మార్చి 4న ఇరాన్ యుద్ధ నౌకపై అమెరికన్ టోర్పిడోడ్ దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 84 మంది మరణించారు. 32 మందిని శ్రీలంక నేవీ రక్షించింది. ఈ ఘటన శ్రీలంక సముద్ర జలాల సరిహద్దులోనే జరిగింది. మరోవైపు ఇరాన్ యుద్ధం ప్రభావం శ్రీలంకపై కూడా పడింది. ముఖ్యంగా చమురుకు ఇబ్బందులు పడుతోంది. అందుకే అక్కడ వారానికి 4 రోజులే పనిదినాలుగా ప్రకటించింది. ఇప్పటివరకు శ్రీలంకలో ఐదు రోజులే పని దినాలుగా ఉండేవి. శని, ఆదివారాల్లో సెలవులుండేవి. కానీ, ఇప్పుడు బుధవారం కూడా సెలవు దినంగా ప్రకటించింది.

## బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు...ప్రగల్భాలు

మొదటి తరువాయి

ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బండి సంజయ్ కుమార్ స్పందిస్తూ తీవ్రంగా విమర్శించారు. 'మోసం.. దగా.. ప్రజా వంచన బ్జడెట్ ఇది' అంటూ వ్యాఖ్యలు చేశారు.మరో రూ.లక్ష కోట్ల అదనపు అప్పు భారం ప్రజలపై మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గు చేటని అన్నారు. రాష్టాన్ని భ్రష్టుపట్టించడంలో కాంగ్రెస్ హ్యాట్రిక్ కొట్టిందని అన్నారు. కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకేమీ చేయలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రైతు భరోసా నిధులు రెండు విడతలు ఎగ్గొట్టినట్లేనా అని కేంద్రమంత్రి ప్రశ్నించారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారని ఆరోపించారు. 'మహిళలను మళ్లీ వంచించారు... తులం బంగారం తుస్.. రూ.2,500లు నిల్' అని అన్నారు. అవ్వాతాతల నోట్లో మట్టి కొట్టారని.. రూ.4 వేల పెన్షన్ పెంపు గురించి ఊసే లేదని విమర్శించారు. నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని.. బ్జడెట్‌లో నిరుద్యోగ భృతి అంశమే లేదని ఆయన అన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు అంటూ ప్రకటించినా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. ఆరు గ్యారంటీలకు పాడె కట్టే బ్జడెట్ ఇదని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీకి కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ ప్రతిపాదించినా 8 శాతానికే పరిమితం చేశారని బండి సంజయ్ విమర్శించారు. దేవాదాయ శాఖకు గత బ్జడెట్‌లో రూ.190 కోట్లు కేటాయించినా ఈసారి ప్రస్తావనే లేదని అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటి తుడుపు కేటాయింపులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. 56 శాతం బీసీ జనాభాకు కేవలం 4 శాతం మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా బ్జడెట్‌లో అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. మైనారిటీలకు గతేడాది కంటే ఎక్కువ నిధులు కేటాయించడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ఆర్థిక మంత్రి చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో వచ్చిన పెట్టుబడుల వివరాలు వెల్లడించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని.. ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తున్నారని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ చేసిన అప్పుల భాగోతంపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

## జాబ్ ఫస్ట అనేది కూటమి లక్ష్యం

మొదటి తరువాయి

ఉద్యోగాలు భర్తీచేస్తామని వివరించారు. ఉగాది పచ్చడి జీవితాలను ప్రతిబింబిస్తుందని, షడ్రుచుల తరహాలో జీవితంలోనూ కష్టసుఖాలు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 నాటికి తెలుగుజాతిని అగ్రస్థానంలో నిలిపేలా సంకల్పం తీసుకుని ముందడుగు వేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. యువతకు ఉద్యోగ కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఇప్పటివరకు 30,607 మందికి ప్రభుత్వోద్యోగాలు ఇచ్చాం. ప్రైవేటురంగంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం' అని సీఎం వివరించారు.జాబ్ ఫస్ట్ అనేది కూటమి ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనికి ఉగాది కానుకగా విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను జత చేశారు. 'శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా వివిధ ప్రభుత్వశాఖల్లో 10,060 ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం. మే 15 నుంచి అక్టోబరు 15 వరకు వీటి నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. ఉద్యోగార్థులు సన్నద్ధత, ప్రతిభతో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరుతున్నాను' అని అందులో పేర్కొన్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పంచాగశ్రవణం చేశారు.

# రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్

మొదటి తరువాయి

భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు. రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ అంటే అంకెల చుట్టూ తరిగడం కాదని, అభివృద్ధి సంఖ్యలను ఆవిష్కరించ డమని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము చేస్తున్న కృషికి బడ్జెట్ తార్కాణమని, గత రెండేళ్ల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు. మొత్తం బడ్జెట్.. రూ.3,24,234 కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లుగా చూపారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే.. 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటాయించారు. బడ్జెట్ లో 5 కీలక రంగాలకు భట్టి ప్రాధాన్యతనిచ్చారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రూ. 23,179 కోట్లు కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కారు విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల పాఠశాలల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు భారీగా నిధులు కేటాయించారు. ప్రజా పాలన - ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తూ మహాలక్ష్మి,



గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారెంటీల అమలుకు అవసర మైన నిధులను పుష్కలంగా కేటాయించారు.. మౌలిక సదుపాయాలకు గాను మూలధన వ్యయం రూ. 47,267 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలనలో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. సామాజిక భద్రత లోబీమా పథకాలను చేర్చారు. ప్రతి పేద కుటుంబానికి ధీమా కల్పించేందుకు 'ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం' కింద రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఈ బడ్జెట్‌లో ఒక కీలక అడుగుగాభావించాలి. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందచేస్తారు. ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం ఇస్తారు. రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన చేపట్టారు.. కేటాయింపులను పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు, విద్యా శాఖకు రూ.26,674 కోట్లు, వైద్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు, మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు, పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు, ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు, బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు, మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు, కల్యాణ లక్ష్మి పథకం.. రూ.3,683 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు, యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీ కి రూ.వెయ్యి కోట్లు, మెట్రో రైలు ఫేజ్-2.. రూ.600 కోట్లు, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ పథకం.. రూ.723 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ.. రూ.1143 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్.. రూ.3500 కోట్లు, మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు, ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటయిస్తున్నట్లు భట్టి ప్రకటించారు.

## ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే ముందుకు

మొదటి తరువాయి

ఇకపోతే పదో తరగతి పరీక్షలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఇకపై పదో తరగతి పరీక్షలు లేనట్లే'నని చెప్పారు. ప్రస్తుతం.. దేశమంతా ప్లస్ 2 విధానం అమల్లో ఉందని ప్రస్తావించారు. తమది వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో చట్టప్రకారమే ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము తొందరపడితే టెక్నికల్ రీజన్స్‌తో కోర్టు తిరస్కరించే ప్రమాదముందని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో న్యాయస్థానంలో ఊరట లభించలేదన్నారు. చక్రధర్ గౌడ్.. హరీశ్‌రావుపై పెట్టిన ఫోన్ ట్యాపింగ్, వేధింపుల కేసులో ఆయనకు రిలీఫ్ లభించిందని ప్రస్తావించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో తనను విచారణకు రమ్మని నోటీసులిస్తే హాజరవుతానని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో విచారణ పూర్తి కాకుండా చర్యలు తీసుకోలేమని అన్నారు. కేసీఆర్ బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారని ఆరోపించారు. అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారు. అందుకే ఆయన అసెంబ్లీకి రావడంలేదన్నారు. తెలంగాణ జాతిపిత ఎవరో ప్రజలు డిసైడ్ చేయాలన్నారు. ఏ గ్యారంటీ ఎప్పుడు అమలు చేయాలో తమ దగ్గర ప్రణాళిక ఉందని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. బిఆర్ఎస్ నేతలు చెబితే చేయాలని లేదన్నారు. అందుకే వారు అక్కడ ఉన్నారు..మేము ఇక్కడ ఉన్నామని అన్నారు. కేసీఆర్ హయాంలో అప్పులు, తప్పులు కప్పిపుచ్చి పాలన చేశారని ఎద్దేవా చేశారు. ఆ తప్పులు తాము చేయలేమన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.3.47లక్షల కోట్ల అప్పులు చేశామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులను తీర్చేందుకే తామీ అప్పులు చేయాల్సి వచ్చిందని ప్రస్తావించారు. ఈ 26 నెలల్లో రూ.3.3 లక్షల కోట్లు కేసీఆర్ హయాంలో చేసిన అప్పుల్నే తమ ప్రభుత్వం తీర్చిందని చెప్పుకొచ్చారు. మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం. రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకు చెల్లించాం. మేం తెచ్చిన అప్పుల్లో కేవలం రూ.17వేల కోట్లు మాత్రమే వాడుకున్నాం. జాతీయ జీడీపీ కంటే తెలంగాణ జీఎస్‌డీపీ మెరుగ్గా ఉంది. జీఎస్టీ వసూళ్లు గడిచిన 2 నెలల్లో రూ.4 వేల కోట్లు దాటాయి' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్క ఎకరాకు నీరు ఇవ్వకపోయినా రూ.44 వేల కోట్ల కాళేశ్వరంపై అప్పు తీర్చామన్నారు. హిల్టు టీడీఆర్ భూ బదలాయింపుల పై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఏ విచారణ కోరినా చేపట్టేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇండస్ట్రీకు చెందిన మొత్తం భూములు అమ్మినా లక్ష కోట్ల రూపాయలు రావని ముఖ్యమంత్రి తెలిపారు. హిల్టులో ఐదు లక్షల కోట్ల రూపాయల అవినీతి ఎలా జరిగిందని ప్రశ్నించారు. మంత్రి అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీ కోసం సుప్రీంకోర్టు సూచన మేరకు తెలంగాణ గవర్నర్‌ను సంప్రదిస్తామని తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను తొలగించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని అన్నారు. ఇప్పుడున్న జిల్లాలు మండలాల్లో ప్రస్తుతం ఎలాంటి మార్పులూ ఉండవని ఆయన స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ఇచ్చిన రిపోర్టును కేకే కమిటీకి రిఫర్ చేశామని పేర్కొన్నారు. భూముల అమ్మకానికి కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని సీఎం స్పష్టం చేశారు. భూములు అమ్మితే వచ్చిన డబ్బులను సొంతానికి వాడుకోవడానికి తాము వ్యతిరేకమన్నారు. మూసీ విషయంలో ఆగేది లేదన్నారు. నష్టపోయిన వారిని ఎలా ఆదుకోవాలో ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకుంటామని తెలిపారు. ఢిల్లీకి ఎన్నిసార్లు వెళ్లానో లెక్కపెట్టిన వాళ్లు తాను ఎన్ని నిధులు తెచ్చానో కూడా లెక్కపెట్టాలని హితవు పలికారు. గాంధీ మనుమడు కూడా ఒక పౌరుడేనని.. ప్రస్తుతం ఆయనా బీఆర్ఎస్ ట్రాప్‌లో పడ్డారని అన్నారు. గాంధీ విగ్రహం పెట్టొద్దని అనడం సరికాదని, గాంధీ దేశానికి ఆదర్శపురుషుడని అన్నారు. డ్రగ్స్ అంశంలో ఇంత జరుగుతుంటే.. బీజేపీ నేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలను తిడితే బీజేపీ ఎందుకు మాట్లాడుతోందని నిలదీశారు. ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారని అన్నారు. తనను సీఎంగా అంగీకరిస్తున్న మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. జీవన్ రెడ్డి అంశాన్ని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చూసుకుంటారన్నారు. ఆపరేషన్ కగార్ కేంద్ర ప్రభుత్వానిది.. తమది కాదని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిపై కమిటీ అధ్యయనం చేస్తోందన్నారు. మార్పులపై కమిటీ నివేదికే ఫైనల్ కాదన్నారు. జాతీయస్థాయి అధ్యయనం తర్వాత మార్పులు తీసుకురాబోతున్నట్లు చెప్పారు.

## ఆరు గ్యారెంటీలకు సమాధి కట్టారు

మొదటి తరువాయి

2,500 పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇందులో సకలజనుల దక్కింది గుండు సున్నా తప్ప ఏమీ లేదని హరీష్‌రావు విమర్శించారు. అంకెలగారడీ, మాటల గారడీ తప్ప ప్రభుత్వానికి పేదలపట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనే విషయం ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు అభయహస్తమని హామీ ఇచ్చారని, ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా రిక్తహస్తమే మిగిల్చారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లు కాలేదుగానీ మూడున్నర లక్షల కోట్లు అప్పులు చేసిందని, తెచ్చిన ఆ అప్పుతో ఏం చేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడితే.. కాంగ్రెస్ తన రెండున్నరేళ్ల పాలనలో వెనుకపడేసిందని హరీష్‌రావు విమర్శించారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా భట్టి అంబేద్కర్ సూక్తులు, రాజ్యాంగ విలువలను వల్లెవేశారని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెనుక కూసోబెట్టుకుని రాజ్యాంగ విలువల గురించి ఆయన మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క గోరీ కట్టారని దెప్పిపొడిచారు. ఈ బ్జడెట్‌ను చూస్తే ఎన్నికల హామీలపై కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమైందని అన్నారు. గతం కంటే 20పేజీలు పెంచారు తప్ప.. హామీలకు కేటాయింపులు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారని ధ్వజమెత్తారు. సీఎం ప్రజలకే కాదని.. ఎమ్మెల్యేలకు సైతం అందుబాటులో ఉండటం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 3లక్షల పింఛన్లు కట్ చేసి.. 2లక్షల కొత్త పెన్షన్లు ఇస్తామంటున్నారని అన్నారు. కోటీశ్వరులు సంగతి అటుంచి.. మొదట మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్, ఇందిరమ్మ పేర్లతో అమలవుతోన్న స్కీంలకు సైతం కేటాయింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్‌ది.. అభయ హస్తం కాదని.. రిక్త హస్తమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది మూడు ముక్కలాట తప్ప.. విజన్ లేదని దెప్పిపొడిచారు. బ్జడెట్‌లో అన్నివర్గాలకు మొండి చెయ్యి చూపారని ఆగ్రహించారు. మూడున్నర లక్షల కోట్లు అప్పులు తెచ్చి.. రేవంత్ చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో సచివాలయం, కాళేశ్వరం, చెక్ డ్యాంలు కట్టామని ప్రస్తావించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను వెనుక కూర్చోపెట్టుకుని భట్టి.. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహించారు. కాంగ్రెస్ హయాంలో స్కాంలు తప్ప.. స్కీంలు లేవని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో స్కాం జరిగిందని మంత్రి బిడ్డ స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. గురుకుల పిల్లలకు కడుపు నిండా అన్నం పెట్టలేని సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడేమో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంటున్నారని దెప్పిపొడిచారు. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వానివి కట్టుకథలని విమర్శించారు. అక్రమ సంపాదన దాచుకోవటానికే ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మూడుసార్లు రైతుబంధు ఎగొట్టినందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పాలన గాడి తప్పటం వలనే తలసరి ఆదాయం తగ్గిందని అన్నారు. పారిశ్రామికవేత్తలకు తుపాకులు పెట్టి మాముళ్లు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు.

# కలెక్టరేట్ వద్ద బీజేపీ నిరసన

**రాజన్న సిరిసిల్ల , మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిరిసిల్ల కలెక్టరేట్ వద్ద బీజేపీ అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. రాష్ట్ర రాజకీయాల్లో మళ్లీ హామీల అమలు అంశం వేడెక్కుతున్న తరుణంలో, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై భారతీయ జనతా పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది.రెండున్నర సంవత్సరాలు గడిచినా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు ప్రధాన హామీలు, అలాగే వందల సంఖ్యలో ఇచ్చిన వాగ్దానాలు ఇప్పటికీ అమలు కాలేదని బీజేపీ నేతలు ఆరోపించారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన విద్యార్థి భృతి, నిరుద్యోగులకు హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి ఇంకా అందలేదని, జాబ్ క్యాలెండర్



విడుదల విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, రైతు భరోసా ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తుకు వస్తోందని విమర్శించారు. మహిళలకు ప్రకటించిన కల్యాణ లక్ష్మీ, తులం బంగారం వంటి పథకాల అమలు ఎక్కడుందో చెప్పాలని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు రిప్రజెంటేషన్ ఇవ్వాలని బీజేపీ నిర్ణయించింది. ప్రభుత్వం హామీలు నెరవేర్చే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రకటించింది. ఈ కార్యక్రమంలో జిల్లా మరియు రాష్ట్ర పదాధికారులు, జిల్లా మోర్చా నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీస్ వర్సెస్ జర్నలిస్టుల క్రికెట్ మ్యాచ్లో సిఐ ప్రవీణ్ హాఫ్ సెంచరీ







**పెద్దపల్లి, మార్చి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఎంఏ హెల్త్ కప్ ట్రోఫీలో భాగంగా గురువారం జరిగిన పోలీస్ వర్సెస్ జర్నలిస్టుల క్రికెట్ మ్యాచ్ ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. రెండు జట్ల మధ్య హోరాహోరీ పోరు చోటుచేసుకుని ప్రేక్షకులను అలరించింది.మ్యాచ్‌ను ఏసీపీ గజ్జి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధి నిర్వహణలో భాగంగా ఉద్యోగులు పని ఒత్తిడికి గురవుతారని, ఇలాంటి క్రీడలు మానసిక ప్రశాంతతను కలిగించి తిరిగి విధులను మరింత ఆసక్తిగా చేయడానికి తోడ్పడతాయని అభిప్రాయపడ్డారు. హెల్త్ కప్ నిర్వహిస్తున్న వైద్యులు రేగళ్ళ రమాకాంత్, ప్రణీత్ తదితరులను ఆయన అభినందించారు.బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అద్భుతంగా రాణించిన పోలీస్ జట్టు 24 పరుగుల తేడాతో జర్నలిస్టుల జట్టును ఓడించి విజయం సాధించింది.టాస్ గెలిచిన జర్నలిస్టుల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన పోలీస్ జట్టు ఆదిలోనే వికెట్ కోల్పోయినా, ఆ తరువాత ఇన్నింగ్స్‌ను జాగ్రత్తగా కొనసాగించింది. సిఐ ప్రవీణ్ అద్భుతమైన ఆటతీరుతో హాఫ్ సెంచరీ చేసి జట్టు స్కోరును 85 పరుగులకు చేర్చాడు. 86 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జర్నలిస్టుల జట్టు రెండో ఓవర్లోనే తొలి వికెట్ కోల్పోయింది. ఆ తరువాత వరుసగా వికెట్లు కోల్పోయి 61 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్ బెజ్జంకి నరేష్ ఒంటరిగా పోరాడి 38 పరుగులు సాధించి టాప్ స్కోరరుగా నిలిచాడు.మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సిఐ ప్రవీణ్‌కు దక్కింది. పోలీస్ జట్టు తరపున ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్, ఎస్ఐలు లక్ష్మన్, నరేష్, మల్లేష్, శ్రవన్, శ్రీధర్, కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి, అలీం, మనోజ్ పాల్గొన్నారు.

# దేవాదాయ శాఖకు నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు

**- బేతి మహేందర్ రెడ్డి**



**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర బడ్జెట్‌లో దేవాదాయ శాఖకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం పట్ల జనసేన పార్టీ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. హిందూ దేవాలయాల నుండి వచ్చే ఆదాయాన్ని మైనారిటీ శాఖకు మళ్లించడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని బట్టబయలు చేస్తోందని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేవంత్ సర్కార్ మైనారిటీ శాఖ పట్ల చూపుతున్న ప్రేమ, దేవాదాయ శాఖ పట్ల లేకపోవడం బాధాకరం. హిందువులు హుండీల్లో కానుకలు వేయడం మానేస్తే కానీ దేవాలయాల అభివృద్ధి గుర్తుకు రావడం దారుణం" అని వ్యాఖ్యానించారు. శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమానికి 3769 కోట్లు కేటాయించి, దేవాదాయ శాఖను పూర్తిగా విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వ హిందూ వ్యతిరేకతను స్పష్టంగా చూపుతోందని ఆయన అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో ధూపదీప నైవేద్యాలకు కూడా నిధులు లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. మైనారిటీలకు హజ్ యాత్రకు ఉచిత ప్రయాణం కల్పిస్తూ, మస్జిద్--దర్గాల అభివృద్ధికి నిధులు కేటాయించడం ఓటు బ్యాంకు రాజకీయాలకు నిదర్శనమని బేతి మహేందర్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. హిందూ దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించే వరకు భక్తులు హుండీల్లో కానుకలు సమర్పించవద్దని ఆయన పిలుపునిచ్చారు. మన దేవాలయాల ఆదాయం తగ్గినప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి వస్తుంది. అప్పుడే దేవాదాయ శాఖకు నిధులు కేటాయించి అభివృద్ధి మార్గం సుగమం అవుతుంది అని ఆయన పేర్కొన్నారు.

# మేడిపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్గా చింత శంకరయ్య

**- స్వాగతం పలికిన మాల మహానాడు నాయకులు ఉప్పల దయాకర్**




**హైదరాబాద్ మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతనంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన చింత శంకరయ్య ను మాల మహానాడు రాష్ట్ర నాయకులు ఉప్పుల దయాకర్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి హృదయపూర్వక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## రూరల్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి నూతన విశ్రాంతి గది ఏర్పాటు



**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పోలీస్ సిబ్బంది సంక్షేమం, పనితీరును మెరుగుపరిచే లక్ష్యంతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన విశ్రాంతి గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి మానసిక ప్రశాంతత, శారీరక విశ్రాంతి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో రాజీ పడబోమని, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలను ఆధునీకరించి, సిబ్బందికి మెరుగైన పని వాతావరణాన్ని కల్పించడానికి విభాగం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. తగిన విశ్రాంతి పొందిన అధికారులు అత్యవసర సమయాల్లో ప్రజలకు సేవ చేయడంలో మరింత చురుకుగా, సమర్థవంతంగా పనిచేస్తారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, రూరల్ ఏసీపీ విజయకుమార్, ట్రాఫిక్ ఏసీపీ వెంకటస్వామి, రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, ఎస్సైలు నరేష్, లక్ష్మా రెడ్డి తో పాటు ఇతర పోలీసు అధికారులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బిలాల్ మసీదులో ఇఫ్తార్ విందు




**క్యాతన్‌పల్లి, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రంజాన్ మాసం సందర్భంగా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బిలాల్ మసీదు (ఏ జోన్)లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో సౌహార్దం, సోదరభావం మరింత పెరగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో భాగమయ్యారు.

## రంజాన్ ప్రార్థన స్థలాలను వీక్షించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించే ఈద్గాల వద్ద భద్రతా ఏర్పాట్లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్శనలో భాగంగా ఆయన సాలెహ్ నగర్ ఈద్గా, సప్తగిరి కాలనీ ఈద్గా, కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ముందు ఉన్న ఈద్గా సహా పలు ప్రార్థనా స్థలాలను పరిశీలించారు. సమీక్ష అనంతరం కమిషనర్ స్థానిక అధికారులతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. ప్రార్థనలు జరిగే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఈద్గాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈద్గాల వైపు వచ్చే రహదారులలో ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు అవసరమైన చోట ముందస్తుగా రూట్ డైవర్షన్ చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ ఏసీపీని ఆదేశించారు. అలాగే స్థానిక కమిటీలతో సమన్వయం చేసుకుంటూ పండుగను శాంతియుత వాతావరణంలో జరగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట స్థానిక ఏసీపీలు, సీఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణకార సభ్యుల సమక్షంలో డిసిసి ప్రధాన కార్యదర్శి దేవరకొండ రాజుకు ఘన సన్మానం



**పెద్దపల్లి, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
**పెద్దపల్లి** జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన దేవరకొండ రాజును స్వర్ణకార, బంగారు వర్తక సంఘ ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, నమ్మకంతో కీలక బాధ్యతలను అప్పగించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ విజయరమణారావు, డిసిసి అధ్యక్షుడు మక్కన్ సింగ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ వెండి బంగారు సంఘ అధ్యక్షుడు రంగు శ్రీనివాస్, స్వర్ణకార సంఘ అధ్యక్షుడు కట్ట రమేష్, గౌరవ అధ్యక్షుడు కాసాల నరసింహచారి, ఉపాధ్యక్షులు సిరికొండ వేణుగోపాల్, కోశాధికారి బాణాల లక్ష్మణ్, ఆల్ ఇండియా సెక్రటరీ కందుకూరి పూర్ణాచారి, రాష్ట్ర కార్యదర్శి మదుపు రామనర్సయ్య, సలహాదారులు కట్ట రాజానందం, ఉపాధ్యక్షులు దేవరకొండ చంద్రమౌళి, మునిగంటి కృష్ణ, రంగు శ్రీనివాస్, స్వర్ణకార సంఘ నాయకులు పలువురు పాల్గొన్నారు.

## గ్రూప్ వన్ అభ్యర్థిని అభినందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలోని అత్యున్నత పదవులలో ఒకటైన గ్రూప్--వన్లో ఎంపికై డీఎస్పీగా నియమితులైన కరీంనగర్ పట్టణ మంకమ్మతోటకు చెందిన బత్తుల శివకుమార్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని తొలిసారి జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా చొప్పదండి శాసన సభ్యుడు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, కరీంనగర్‌లోని వారి నివాసంలో శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## డీసీసీ సభ్యుడిగా పరమేశ్ నియామకం



**పెద్దపల్లి, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
టీపీసీసీ ఆదేశాల మేరకు పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సూత్రపు పరమేశ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ విడుదల చేసిన జిల్లా కార్యవర్గంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఆయనకు అవకాశం లభించింది. పరమేశ్ నియామకంపై పలువురు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయరమణారావు, జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్‌లకు పరమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. విప్ విజయరమణారావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని పరమేశ్ స్పష్టం చేశారు.

## రంజాన్ తోఫా కిట్ల పంపిణీ




**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంజాన్ పండుగ సందర్భంగా 9వ డివిజన్‌లోని ముస్లిం సోదర సోదరీమణులకు ప్రభుత్వం అందించిన రంజాన్ తోఫా కిట్లను కార్పొరేటర్ వసంత లక్ష్మి భూమన్న ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల శ్యామ్ సుందర్ రెడ్డి, రామిడి తిరుపతిరెడ్డి, తిరుమల, కనక లక్ష్మి, నిర్మల, బండ లక్ష్మి, మామిడాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో బీసీలకు వివక్ష

-గుంజపడుగు హరిప్రసాద్



**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో మహిళలు, బీసీలు, పేదలు, యువకులు, వృద్ధులు అందరూ మోసపోయారని ఆయన ఆరోపించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ,ఆరు గ్యారంటీలలో ముఖ్యమైనది మహిళలకు ప్రతి నెల ఇరవై ఐదు వందల రూపాయలు ఇవ్వడం. కానీ ఈ బడ్జెట్‌లో ఆ గ్యారంటీకి ఎలాంటి ప్రస్తావన లేదు. ఇది పూర్తిగా అంకెల గారడీ మాత్రమే అని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్లో ప్రతి సంవత్సరం ఇరవై వేల కోట్ల రూపాయలు బీసీల సంక్షేమానికి కేటాయిస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం పన్నెండు వేల కోట్లు మాత్రమే కేటాయించడం బీసీలను మోసం చేయడమేనని ఆయన మండిపడ్డారు. అలాగే వృద్ధులకు నాలుగు వేల రూపాయల పించన్స్ ఇస్తామని చెప్పి, బడ్జెట్‌లో దానికి ప్రస్తావన లేకపోవడం ముసలివాళ్లకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమానికి కూడా నిధుల కేటాయింపులో వివక్ష చూపారని, పేదల ఆరోగ్యాన్ని, విద్యను పూర్తిగా గాలికి వదిలేశారని ఆయన అన్నారు. యువతకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, బడ్జెట్‌లో జాబ్ క్యాలెండర్‌కి కనీస ప్రస్తావన లేకపోవడం యువతను పూర్తిగా మోసం చేయడమేనని హరిప్రసాద్ పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కూడా ఎలాంటి నిధులు కేటాయించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని బట్టబయలు చేస్తోందని ఆయన అన్నారు. ఈరోజు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసే బడ్జెట్ అని గుంజపడుగు హరిప్రసాద్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

# ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం




**కరీంనగర్ రూరల్ , మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నగునూరు గ్రామంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ ద్వారా వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవడంతో పాటు సేవాభావంతో ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శాతవాహన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఈ. మనోహర్ మాట్లాడుతూ, నవ సమాజ నిర్మాణంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర కీలకమని, గ్రామాల్లో సమస్యలపై అవగాహన పెంపొందించి పరిష్కార మార్గాలను అన్వేషించాలన్నారు. నగునూరు గ్రామ సర్పంచ్ సాయిళ్ళ శ్రావణి మహేందర్ మాట్లాడుతూ, గ్రామంలో ఏడు రోజుల సేవా కార్యక్రమాలకు వాలంటీర్లు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పచ్చదనం, పరిశుభ్రత, మూఢనమ్మకాల నిర్మూలన, అక్షరాస్యత ప్రాముఖ్యత వంటి అంశాలపై ర్యాలీ నిర్వహించారు. శ్రమదాన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిసరాల్లోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపి కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, బైరం మహేష్, నాంపల్లి శ్రీనివాస్ తో పాటు వాలంటీర్లు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని విస్మరించిన రేవంత్ ప్రభుత్వంపై ఏఐఎస్ఎఫ్ ఆగ్రహం



**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం పట్ల ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యారంగం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది ఈరోజు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా స్పష్టమవుతోంది. ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం అని అన్నారు. రమేష్ పేర్కొంటూ, బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 8.22% నిధులు కేటాయించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో కనీసం 15% నిధులు కేటాయిస్తామని చెప్పి ఇప్పుడు దానికి విరుద్ధంగా వ్యవహరించడం దారుణమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదివేల కోట్ల రూపాయల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఉండగా, ప్రభుత్వం కేవలం 4,343 కోట్లు మాత్రమే కేటాయించడం విద్యార్థులపై అన్యాయం అని ఆయన ప్రశ్నించారు. ఉన్నత విశ్వవిద్యాలయాలకు తక్కువ నిధులు కేటాయించడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూరిబా పాఠశాలలకు ప్రస్తావన లేకపోవడం విడ్డూరమని అన్నారు. డిగ్రీ కళాశాలలు, ఇంటర్నేషనల్ పాఠశాలలు, స్వంత భవనాలకు నిధులు లేకపోవడం విద్యా అభివృద్ధికి కాకుండా విద్యా దరిద్రానికి దారి తీస్తుందని ఆయన విమర్శించారు. యువతకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, బడ్జెట్‌లో జాబ్ క్యాలెండర్‌కి కనీస ప్రస్తావన లేకపోవడం యువతను పూర్తిగా మోసం చేయడమేనని రమేష్ పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కూడా ఎలాంటి నిధులు కేటాయించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని బట్టబయలు చేస్తోందని ఆయన అన్నారు. ఇలా చేస్తే రానున్న కాలంలో కాంగ్రెస్‌కు రాష్ట్రంలో పుట్టగతులు ఉండవు అని మచ్చ రమేష్ హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు అండ

- గుర్రం కేశవులు



**ఆమనగల్లు, మార్చి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నిలువ నీడ లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో కాంగ్రెస్ పేదలకు అండగా నిలిచిందని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డుకు చెందిన బుజ్జి ఇందిరమ్మ ఇంటిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గుర్రం కేశవులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు పేదల కళ నెరవేర్చుతోందన్నారు. రాష్ట్రంలోని పేదల సొంతింటి కల కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో నిరుపేదలకు ఒక్క ఇల్లు కూడా దక్కలేదన్నారు. పేదల సొంతింటి కల నెరవేరుతుందన్నారు. ముఖ్యమంత్రి పేద ప్రజలకు అండగా నిలబడి సొంత ఇల్లు నిర్మాణం చేసుకొని ఆత్మగౌరవంతో బతికేల చేస్తున్నారని అన్నారు. ఇండ్లు పూర్తయి గృహప్రవేశం చేస్తున్న కుటుంబాల కళ్లలో ఆనందం కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో రాగ్య నాయక్, గోపాల్ నాయక్, శ్రీధర్ నాయక్, హర్యా నాయక్, రమేష్, బాలకోటి, రాజు, చందు, తిరుమలేష్, శ్రీను, రవి, రాజు తదితరులు ఉన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కరీంనగర్ రూరల్ పోలీసులు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వల్లం పహడ్ గ్రామానికి చెందిన మహేష్ తన యజమాని సందవేని సంపత్ ఆదేశాల మేరకు ట్రాక్టర్‌లో ఇసుకను రవాణా చేస్తుండగా తీగలగుట్టపల్లి రైల్వే గేట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అదే సమయంలో చొప్పదండి మండలం చాకుంట గ్రామానికి చెందిన కుడిదల అజయ్, నీరుకుల్లా అనిల్ కుమార్‌లు తమ యజమాని శంకరి శ్రవణ్ ఆదేశాల మేరకు ట్రాక్టర్‌లో ఇసుకను నింపుకొని రవాణా చేస్తుండగా అదే ప్రాంతంలో పోలీసులు పట్టుకున్నారు. మరోవైపు మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన కళ్ళపల్లి సుధాకర్ తన యజమాని మీసాల సాయిలు ఆదేశాల మేరకు ఇసుకను రవాణా చేస్తుండగా జిల్లా పరిషత్ స్కూల్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేసి, నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎస్సై వంశీకృష్ణ



**గంగాధర, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామంలో భద్రతను బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన తొమ్మిది సీసీ కెమెరాలను శుక్రవారం ఎస్సై వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, గ్రామంలో సీసీ కెమెరాల వ్యవస్థ ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించడం, అనుమానాస్పద కదలికలను గుర్తించడం సులభమవుతుందని తెలిపారు. ప్రజల భద్రతను కాపాడడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. బచ్చు దయాకర్ సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై వివరించారు. భవిష్యత్తులో ఏదైనా నేర సంఘటనలు జరిగినప్పుడు దర్యాప్తుకు ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ గ్రామ భద్రతను కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు. సీసీ కెమెరాల నిర్వహణను సక్రమంగా కొనసాగిస్తే గ్రామంలో శాంతి భద్రతలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోల మమత శ్రీనివాస్, ఉపసర్పంచ్, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నలుగురి అరెస్టు



**కరీంనగర్ రూరల్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నగునూరు గ్రామంలోని లిసిల్వర్ స్ప్రింగ్ విల్లాస్‌లిలోని స్టోర్ రూమ్ నుంచి సుమారు 60 వేల రూపాయల విలువైన కరెంటు వైర్ బండిల్స్ దొంగతనం జరిగిన ఘటనలో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి, ఈరోజు ఉదయం తీగలగుట్టపల్లి--ఆరేపల్లి మార్గంలోని ఎల్లమ్మ గుడి వద్ద అనుమానాస్పదంగా కనిపించిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు నగునూరులో జరిగిన దొంగతనం గురించి ఒప్పుకున్నారు. దొంగిలించిన వైర్ బండిల్స్‌ను చెట్ల పొదల్లో మట్టి కప్పి దాచినట్లు చూపించారు. అరెస్టైన నిందితులు బొంత కుమార్, అలకుంట్ల జంపయ్య అలియాస్ జంపరాజు, సూర శివాజీ, సూర నవీన్‌లుగా గుర్తించారు. వీరు మహబూబాబాద్ జిల్లా నుంచి కరీంనగర్‌కు వచ్చి వావిలాలపల్లి, తీగలగుట్టపల్లి ప్రాంతాల్లో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నారని, మద్యం అలవాటుతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనానికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. నిందితులను రిమాండ్ కోసం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఈ దొంగలను పట్టుకున్న రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ లక్ష్మారెడ్డి, కానిస్టేబుళ్లు సల్మాన్, అఫ్జల్‌లను సీఐ నిరంజన్ రెడ్డి అభినందించారు.

# మహిళల పురోభివృద్ధి కాంగ్రెస్ పాలనలోనే సాధ్యం

### ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**తిమ్మాపూర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలోనే మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధిస్తారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామంలో వీవో భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు అందజేస్తోందని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతి మహిళా సంఘానికి 2 లక్షల రూపాయలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన వెంటనే దాన్ని అమలు చేసిందని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, మహిళా సంఘాల పటిష్టతకు పాటుపడలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కొత్త పనులు



చేపట్టకపోయి, గత కాంగ్రెస్ ప్రభుత్వంలో మంజూరైన పనులను మాత్రమే కొనసాగించారని అన్నారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత వీవో భవన నిర్మాణాలను వేగవంతం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి, గ్రామ సర్పంచ్ తాట్ల తిరుపతి, ఉప సర్పంచ్ మహేష్, పార్టీ నాయకులు జె. లింగయ్య, జె. రవి, రమేష్, పాశం రాజిరెడ్డి, సతీష్ రెడ్డి, రవికుమార్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో వీవో భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి. శ్వేత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, దావు సంపత్ రెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, బుదారపు శ్రీనివాస్, మాచర్ల అంజయ్య, గోగూరి నరసింహారెడ్డి, అజయ్, మాచర్ల శీను, అలవాల బాబు, సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నేదునూరు గ్రామంలో వీవో భవన నిర్మాణ పనులకు కూడా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనకం లక్ష్మీ, కొమరయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారు రమేష్, పార్టీ నాయకులు రెడ్డి గాని రాజు, ఉప్పులేటి రాజు, మామిడి అనిల్ కుమార్, గోగూరి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యాదవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యత్వ నమోదు ప్రారంభం

**పెద్దపల్లి, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

యాదవ చారిటబుల్ ట్రస్ట్‌లో సభ్యత్వ నమోదు ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతుందని ట్రస్ట్ నాయకులు తెలిపారు. అఖిల భారత యాదవ మహాసభ, యాదవ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా పెద్దపల్లి ట్రస్ట్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంధనవేని రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ, జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్ ఆదేశాల మేరకు మండల కమిటీలను రద్దు చేసి, ఏప్రిల్ 10 నుండి కొత్త కమిటీలను ఎంపిక చేస్తామని తెలిపారు. మహిళ, యువత, యోప విభాగాలను కూడా ఏర్పాటు చేసి సంఘ బలోపేతానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. యాదవ విద్యార్థి వసతి గృహ నిర్మాణానికి జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్ రూ. 40 లక్షలు విరాళం ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వ్యాపారస్తులు, కాంట్రాక్టర్లు, ఎన్నారైలు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల యాదవ కుల బాంధవులు





విరాళాలు అందించాలని కోరారు. ట్రస్ట్ చైర్మన్ మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా పెద్దపల్లి జిల్లాలో పేదల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రస్టీ సభ్యత్వం పొందదలచిన వారు ఈ నెల 31లోపు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ట్రస్టీ సభ్యత్వం రూ. 1,10,116, ట్రస్ట్ సభ్యత్వం రూ. 10,116గా నిర్ణయించారని వివరించారు. సమావేశంలో నాయకులు చిలారపు పర్వతాలు యాదవ్, పెగడ రమేష్ యాదవ్, గొడుగు రాజ్‌కుమార్ యాదవ్, వేల్పుల నాగరాజ్ యాదవ్, గుంపుల ఓదెలు యాదవ్, బత్తిని లక్ష్మణ యాదవ్, మారం వెంకటరమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఝూలేలాల్ జీ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి బండి సంజయ్

**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సింధీ సమాజం దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి ఉన్న ఒక ప్రాచీన, సాంస్కృతికంగా సమృద్ధి చెందిన సమాజమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్‌లో సింధీ సమాజం నిర్వహించిన ఝూలేలాల్ జయంతి మరియు చేటీ చంద్ నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, దేశ విభజన సమయంలో సింధీ సమాజానికి విపరీతమైన నష్టం జరిగినా, ఝూలేలాల్ జీ స్ఫూర్తితో తమ సంప్రదాయాలను కాపాడుకుంటూ ప్రత్యేక గుర్తింపును తిరిగి తెచ్చుకున్నారని పేర్కొన్నారు. తెలుగు వారికి ఉగాది ఎంతటి ప్రాధాన్యత కలిగిన పండుగో, సింధీ సమాజానికి ఝూలేలాల్ జయంతి అంతటి





ప్రాధాన్యత కలిగినదని ఆయన అన్నారు. దేవుడు ఒక్కరే, మానవత్వం ఒక్కటే అనే ఝూలేలాల్ జీ సందేశం నేటికీ ప్రేరణగా నిలుస్తోందని, ధైర్యం, ఐక్యత, అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడే విశ్వాసానికి ఆయన జీవితం ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. సింధీ సమాజం వ్యాపార, పారిశ్రామిక, సేవా రంగాల్లో ముందంజలో ఉందని, అదానీ కుటుంబం, హిందూజా గ్రూప్, ఫ్యూచర్ గ్రూప్, లాల్ వాణీ గ్రూప్ వంటి ప్రముఖ వ్యాపార వర్గాలు సింధీ మూలాలవని గుర్తు చేశారు. బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్, బీజేపీ వ్యవస్థాపకుడు ఎల్.కే. అద్వానీ వంటి ప్రముఖులు కూడా సింధీ సమాజానికి చెందిన వారేనని అన్నారు. కరీంనగర్ గాంధీ రోడ్ వైశ్యా భవన్ సమీపంలో జరిగిన వేడుకల్లో సింధీ యువకులు, మహిళలు ఉల్లాసంగా నృత్యం చేశారు. వారితో కలిసి బండి సంజయ్ కూడా డ్యాన్స్ చేసి, అనంతరం సింధీలు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

# అందరికి శుభాలు కలగాలి

**ఆమనగల్లు, మార్చి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

నూతన తెలుగు సంవత్సరాది నుంచి అందరికీ శుభాలు కలగాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి తెలిపారు. గురువారం పట్టణ కేంద్రంలోని అంగడి బజార్ హనుమాన్ దేవాలయంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. "పంచాంగ శ్రవణం కార్యక్రమంలో తల్లోజు ఆచారి, మున్సిపల్ ఛైర్మన్ పత్యానాయక్, కౌన్సిలర్లు ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ



పురోహితులు రాశి ఫలాలను వివరించారు. షడ్రుచుల పచ్చడి, బక్షాలు పంపిణీ చేశారు. అనంతరం ఆచారి మట్లాడుతూ.. సమృద్ధిగా పాడి పంటలతో అందరూ సుఖంగా జీవించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలందరికీ మేలు జరిగేలా భగవంతుడి ఆశీర్వాదం అందాలని



కోరారు. వేడుకల్లో కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, నాగిళ్ళ జగన్, ఎర్రవోలు మహేష్, మొక్తల వెంకటయ్య, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, కాలే మల్లయ్య, పాతకోట శ్రీశైలం, అల్లాజీ గౌడ్, మేడిశెట్టి శ్రీధర్, కుమార్ గౌడ్, వంశీ, శ్రీను తదితరులు ఉన్నారు.

# సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి
-పిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్.
- మార్కెట్ చైర్మన్ యాట గీత నరసింహ



**కల్వాల్, మార్చి 20 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ ) :** పేదల సొంతింటి కలను నేరవేర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించిందని ఇల్లు లేని ప్రతి పేద వారికీ ఇల్లు ఇస్తుందని టీపీసీసీ సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ అన్నారు.కల్వకుర్తి నియోజక వర్గం లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆధ్వర్యం లో ఇండ్లు లేని అర్హులైన ప్రతి పేద వారికీ ఇండ్లు మంజూరు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా రంజక పాలనను ప్రజలు స్వాగతించారని ఇందిరమ్మ రాజ్యం తెచ్చిన ఘనత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కే దక్కుతుందని ప్రజా పాలన లో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఆయన పెర్కోన్నారు. గోవిందపల్లి తండా గ్రామ పంచాయతి లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారతో మంజూరైనా రెండు ఇందిరమ్మ ఇండ్లు 1.బానావత్ స్వరూప,పాత్లావత్ లక్ష్మి ఇండ్ల గృహప్రవేశం పూజలో పాల్గొని ఇండ్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సబావట్ జాను రమేష్ నాయక్ ఉప సర్పంచ్ కేతావత్ రతన్ .హిరాసింగ్ నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిచ్య నాయక్, సింగల్ విండో డైరెక్టర్ వెంకటేష్, మాజీ సర్పంచ్ రాములు నాయక్ మరియు వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి కనీసం 20% బడ్జెట్ కేటాయించాలి

**- టీపిటిఎఫ్**



**హైదరాబాద్, మార్చి 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ కేటాయింపులు జరగడం గర్హనీయమని టీపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి విమర్శించారు.మొత్తం రూ.3,24,234 కోట్లలో విద్యారంగానికి కేవలం రూ.26,674 కోట్లు కేటాయించారని, ఇది గత సంవత్సరం కంటే కేవలం 0.63% పెరుగుదల మాత్రమేనని, మొత్తం బడ్జెట్‌లో 8.23% మాత్రమేనని తెలిపారు. "విద్యా వ్యవస్థను సమూలంగా మారుస్తామని అట్టహాసంగా ప్రకటించిన ప్రభుత్వం, ఉన్న పాఠశాలలను బలోపేతం చేయడం విస్మరించింది. విద్యా కమిషన్ రిపోర్ట్ వెలువడిన తరుణంలో ఇంత తక్కువ కేటాయింపులు చేయడం గర్హనీయం" అని అన్నారు.విద్యారంగానికి కనీసం 20% నిధులు కేటాయించాలని, రిటైర్డ్ టీచర్ల పెన్షన్ బిల్లులు, పెండింగ్ బిల్లులు, పీఆర్సీ ప్రకటనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "మాటలకు చేతలకు పొంతనలేని ప్రభుత్వం వల్ల విద్యార్థుల సంఖ్య 27 లక్షల నుండి 16 లక్షలకు పడిపోయింది. నాణ్యమైన విద్య, తరగతి గదులు, ఉపాధ్యాయ నియామకాలు, సానిటేషన్, కంప్యూటర్లు, గ్రంథాలయాలు, క్రీడా వసతులు--- అన్నీ బడ్జెట్ కేటాయింపులపైనే ఆధారపడి ఉన్నాయి" అని పేర్కొన్నారు. ఈనెల 24న అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యాయులు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# ఉగాది రోజున గోరుపాటి కుటుంబం మొక్కల చెల్లింపు





**శ్రీరాంపూర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వందల ఏళ్లుగా కొనసాగుతున్న ఆచారాన్ని నిలబెట్టుకుంటూ గోరుపాటి కుటుంబం (మోతయ్య, పీరయ్య, నర్సయ్య) ప్రతి ఉగాది రోజున ఓదెల మల్లీ ఖర్జున స్వామికి ఎద్దుల బండి రథంతో మొక్కలు చెల్లించడం ఆనవాయితీగా కొనసాగిస్తోంది. ఈసారి కూడా ఉమ్మడి కుటుంబం ఆనందంగా వేడుకను జరుపుకుంది. గోరుపాటి మొగిలి తన ఎద్దుల బండిని రథంలా అలంకరించి, ఆధ్యాత్మికత--భక్తి భావంతో స్వామివారికి మొక్కను సమర్పించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ సంప్రదాయ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# మార్క్‌ఫెడ్ ద్వారా రైతులు అమ్మకాలు చేయాలి

-- ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అమ్రాబాద్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట నియోజకవర్గం మరియు నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఈ రబీ సీజన్‌లో మొక్కజొన్న విస్తారంగా సాగు చేయబడిందని, రైతులు తమ పంటను కేవలం ప్రభుత్వ ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ ద్వారా రెండు రోజుల్లో ప్రారంభించబోతోందని ఆయన వెల్లడించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ దళారుల వద్దకు వెళ్లకూడదని, ప్రైవేట్ కేంద్రాలలో అమ్మకాలు చేయకుండా ప్రభుత్వ ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ కేంద్రాల ద్వారా మాత్రమే విక్రయించాలని సూచించారు.రైతులందరూ ఈ విషయాన్ని గమనించి, తమ పంటను ప్రభుత్వ కేంద్రాల ద్వారానే విక్రయించాలని విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# చలివేంద్రం ప్రారంభించిన వైస్ చైర్మన్

**చిట్యాల మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చిట్యాల పట్టణంలో రిక్షా సంఘం అధ్యక్షుడు చిరుమర్తి భిక్షం, కర్రె లింగస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీలక్ష్మి, కౌన్సిలర్ లతారాజేష్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పోకల దేవదాస్ ప్రారంభించారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాటి నర్సిరెడ్డి, గుండెబోయిన సైదులు, మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనరసింహ, పోకల అశోక్, బొబ్బలి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ శోభాయాత్రకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



**షాద్నగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈనెల 27న హిందూ వాహిని ఆధ్వర్యంలో జరగనున్న శ్రీరామ శోభాయాత్రకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.హిందూ వాహిని ప్రతినిధులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "శోభాయాత్రలు ఆధ్యాత్మిక చింతనతో పాటు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయి. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు.మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వామప్ప, కౌన్సిలర్లు సంతోషి భాయి చందులాల్, రాజు నాయక్‌లను కూడా ఆహ్వానించారు.కార్యక్రమంలో హిందూ వాహిని సభ్యులు చెట్ల వెంకటేష్, క్యామ మహేష్, సల్లా మహేష్, చింతకుంట రాఘవేందర్, కమలాజి శ్రీనివాస్ చారి, గుండు అశోక్, గంద్రాతీ శివశంకర్, మంగా విజయ్, పసులోటి శ్రావణ్, గుడాల రమేష్, అల్లాడి శ్రీను, మ్యాడమోని మధు, రామకృష్ణ, దేవేందర్, అశోక్, తరుణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎదిర గ్రామంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన ఎంపీ డీకే అరుణ



**చౌదర్‌గూడా, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ 6.5 లక్షల రూపాయలతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను ఎదిర గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "గ్రామాల అభివృద్ధి ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యం. రోడ్లు, విద్యుత్, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు వంటి మౌలిక వసతులు కల్పించడంలో ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన నిధులు కీలకం" అని అన్నారు. తంగడపల్లి బ్రిడ్జి నిర్మాణం ఫ్లడ్ రిలీఫ్ నిధులతో జరుగుతుందని అధికారులతో చర్చించినట్లు తెలిపారు.కార్యక్రమంలో అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కక్కునూరు వెంకటేష్ గుప్తా, డాక్టర్ టంగుటూరు విజయకుమార్, బిజెపి మండల అధ్యక్షుడు ఎదిర రాజు, సర్పంచ్ జి. విజయలక్ష్మి, దుష్యంత్‌రెడ్డి, చెంది మన మహేందర్‌రెడ్డి, కందూర్ మనోహర్‌రెడ్డి, జి. శివారెడ్డి, మచ్చ సుధాకర్‌రావు, బోయ కురుమయ్య, బోయ శంకర్, బోయ అశోక్, వార్డు సభ్యులు, మహిళలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై అదనపు కలెక్టర్‌కు బిజెపి నాయకుల వినతిపత్రం



**నాగర్‌కర్నూల్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ నాయకులు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ మాజీ కమిషన్ సభ్యులు తల్లోజి ఆచారి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగేందర్ గౌడ్, గోరేటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.నాయకులు మాట్లాడుతూ, "రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. జిల్లాలో పెండింగులో ఉన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి" అని డిమాండ్ చేశారు.

# శివలింగానికి వెండి తొడుగు సమర్పణ



**షాద్‌నగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో శివలింగానికి వెండి తొడుగును సమర్పించే మహత్కార్యం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది.వాసవి క్లబ్ 2023 కమిటీ ప్రత్యేక చొరవతో స్వామివారికి ఈ వెండి కవచాన్ని కానుకగా అందజేశారు. అధ్యక్షుడు గార్లపాటి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో తయారు చేయించిన తొడుగును ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మల్లిపెద్ది శ్రీనివాసులు గుప్తాకు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి శివలింగానికి తొడుగును అలంకరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ, "ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుంది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ 2026 అధ్యక్షుడు గుంట సత్యనారాయణ అధ్యక్షతన సభ్యులు, ఆర్యవైశ్య సంఘం అనుబంధ నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు.

## వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పంచాంగ ఆవిష్కరణ







**వినోభా నగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉగాది నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగ పుస్తకాలు ఆవిష్కరించబడ్డాయి. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ శ్రీహరి ఆచార్య పంచాంగ శ్రవణం చేసి, నూతన సంవత్సర విశేషాలను వివరించారు.పంచాంగ పుస్తక ముద్రణకు సహకరించిన ఆనంద్ బాగ్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్, ఎస్ఎల్ కన్స్ట్రక్షన్స్, మల్లికార్జున స్టీల్ ట్రేడర్స్, మారుతి టూర్స్ ఉ ట్రేడర్స్ యజమానులు, అలాగే ఉగాది ఉత్సవ కన్వీనర్ ఎమ్మడి లక్ష్మీనారాయణను ఆలయ కమిటీ సత్కరించింది.ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## వాగ్దానాల బడ్జెట్ మాత్రమే

-సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి



**కద్తాల్, మార్చి 20 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ ) :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన మూడవ బడ్జెట్ వాస్తవాలకు దూరంగా, కేవలం వాగ్దానాల బడ్జెట్‌గా మారిందని రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి విమర్శించారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలుకు ఈ బడ్జెట్‌లో సరైన కేటాయింపులు చేయలేదని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా, గతంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకైనా తగిన నిధులు కేటాయించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఈ పరిస్థితులు ప్రజా సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న నిబద్ధతను, నిజాయితీని చూపిస్తున్నాయని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిజాయితీగా అమలు చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి డిమాండ్ చేశారు.

# ప్రచారంజక ప్రజా ప్రభుత్వ బడ్జెట్

- బడ్జెట్ లో అన్ని వర్గాలకు న్యాయం
- టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్



**కద్తాల్, మార్చి 20 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ ) :** ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లో రాష్ట్ర ఉపముఖ్య మంత్రి వర్యులు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన తెలంగాణ ప్రజా ప్రభుత్వం బడ్జెట్ 3లక్షల 24 వేల కోట్ల బడ్జెట్ అన్ని వర్గాలకు, పేదలకు న్యాయం చేసే విధంగా ఉందని టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

ఈ సందర్బంగా డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ భీక్య నాయక్ కాంగ్రెస్ నాయకులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ ఇది ప్రజరంజక బడ్జెట్ అన్నారు ముఖ్యంగా విద్యా, వైద్యం,వ్యవసాయం, యువత, విద్యుత్తు, మహిళల కు,పంచాయతీరాజ్ గ్రామీణ గ్రామీణ అభివృద్ధి, ప్రాజెక్టులకు,రవాణా శాఖకు,పురపాలక పట్టణాభివృద్ధికి, యువత కు, మహిళలకు,ఎంతో మేలు చేసే విధంగా ఉంది అని అయన అన్నారు అన్నారు కొత్తగా రెండు లక్షల మందికి 14,861 కోట్లు కేటాయించి పెన్షన్ దారులకు శుభవార్త అన్నారు సన్న బియ్యం కోసం 7366 కోట్లు కేటాయించి ఒక కోటి ఐదు లక్షల మందికి లాభం చేకూర్చే విధంగా ఉందన్నారు, ఇండ్లు లేని పేదవారి కల నెరవేర్చే విధంగా కొత్తగా 4 లక్షల 50 వేల మందికి ఇంద్రమ్మ ఇళ్ల కోసం 7430 కోట్లు కేటాయించి సొంత ఇల్లు కల నెరవేరుస్తుందన్నారు అందరూ సన్న బియ్యం తో భోజనం చేయాలనే ముఖ్యమంత్రి సంకల్పం తో 1 కోటి 5 లక్షల మంది కుటుంబలకు లబ్ది చేకూర్చే విధంగా 7366 కోట్లు కేటాయించి పేదలకు వెన్నుగా నిలిచింది అన్నారు వ్యవసాయానికి 23179 కోట్లు విద్యుత్తుకు 21285 కోట్లు, రైతు భరోసాకు 18000 కోట్లు ఆరోగ్య శాఖ కు 13679 కోట్లు యువ వికాసానికి 6 వేల కోట్లు, పంచాయతీ రాజ్ గ్రామభివృద్ధి కోసం 33688 కోట్లు ప్రాజెక్టులకు 22615 కోట్లు రవాణా శాఖ కు 12789 కోట్లు, పురపాలక పట్టణభివృద్ధికి 17907 కోట్లు మున్సిపాలిటీ ల అభివృద్ధి కి దోహద పడుతుందన్నారు. విద్యాశాఖ కు 26674 కోట్లు కోట్లు కేటాయించి విద్య కు వెలుగులు నింపిందన్నారు, పేద కుటుంబాలకు కుటుంబ భరోసా కోసం 1కోటి 15 లక్షల మందికి లాభం చేకూర్చే విధంగా ఇందిరమ్మ జీవిత భీమా పథకం జూన్ 2 నుండి ప్రారంభించే విధంగా ఇంటి పెద్ద కు 5 లక్షల జీవిత భీమా పథకం మహిళలను కోటి మందిని కోటీ శ్వర్లను చేసే సంకల్పం తో మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చేందుకు 2500 కోట్లు కేటాయింపు ఇంటర్ చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రకటించడం హర్షించదగ్గ విషయం ఐటిఐ ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు 2000 స్కాలర్షిప్ తో పాటు వికలాంగ విద్యార్థులకు రేట్రో ఫిట్టెడ్ మ్యాటరైస్డ్ వాహనాలు ఎంతో మేలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని 9 ఏళ్ళు పాలించి అప్పుల కుప్పగా మార్చారన్నారు. ఇప్పిడిప్పుడే అప్పులు కడుతూ ప్రజల ఆకాంక్షల మేరకు పాలన చేస్తున్నారన్నారు. రాబోయే రోజులల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తుందని కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రజల పక్షాననే ఉంటుందని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమం కద్తాల్ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, మాజీ ఎంపీటీసీ సభ్యులు గురిగల్ల లక్మ్మయ్య,మాజీ కో ఆప్షన్ సభ్యులు జహంగీర్ బాబా, వార్డు సభ్యులు మంకి మహేష్,కిసాన్ సెల్ అధ్యక్షులు బాలరాజు,మంకి శ్రీను, మల్లయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

# కవులు రచయితలు సమాజానికి దిశా దశ చూపించాలి

- డిప్యూటీ మేయర్ వై. సునీల్‌రావు



**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సమైక్య సాహితీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన డింగరి నరహరి ఆచార్య పుస్తకాల ఆవిష్కరణ సభలో డిప్యూటీ మేయర్ వై. సునీల్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం మధనం పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ, "కవులు రచయితలు సమాజానికి దిశా దశ చూపాలి. విద్యార్థులు తెలుగు భాష పట్ల అభిమానాన్ని పెంచుకొని గొప్ప రచయితలుగా ఎదగాలి" అని సూచించారు.డింగరి నరహరి ఆచార్య తనకు తెలుగు బోధించిన గురువు అని, గురువు ప్రభావం శిష్యులపై ఎప్పటికీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 80 ఏళ్ల వయసులో కూడా రచనలు చేయడం గొప్ప విషయం అని ప్రశంసించారు. సమైక్య సాహితీ సంస్థ చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు.ఈ సందర్భంగా ఉజ్జీవనం సంపుటిని భగవతి రమణారావు ఆవిష్కరించారు. "కవుల రచనలు చదివి పిల్లలు ఆసక్తి పెంచుకోవాలి" అని ఆయన అన్నారు. సభకు అధ్యక్షత వహించిన మాడిశెట్టి గోపాల్ మాట్లాడుతూ, "సాహితీ సేవ జగత్‌కల్యాణానికి త్రోవ" అని పేర్కొన్నారు.మధనం పుస్తకాన్ని పద్య కవితా సదస్సు అధ్యక్షుడు రామక విఠల శర్మ సమీక్షించగా, ఉజ్జీవనం పుస్తకాన్ని రచయిత ఏ. గజేందర్‌రెడ్డి సమీక్షించారు. పుస్తక శ్రీకర్త డాక్టర్ గంఢ్ర లక్ష్మణరావు మాట్లాడుతూ, "డింగరి నరహరి నా అత్యంత సన్నిహిత స్నేహితుడు. వయసుతో సంబంధం లేకుండా మనసు చైతన్యంతో ఉండాలి" అని అన్నారు.పుస్తక రచయిత డింగరి నరహరి ఆచార్య మాట్లాడుతూ, "సమతా సాహితీ సంస్థను స్థాపించిన వారిలో నేను ఒకడిని. కవులు, రచయితలను సత్కరించడం సమాజానికి మంచిది. పుస్తక పఠనం, రచనా వ్యాసంగమే నా ఆరోగ్య రహస్యం" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో అతిథులను సన్మానించి, రచయితను గోదాదేవి దంపతులతో పాటు పాఠశాల, సంస్థ, ఇతర కవులు, రచయితలు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు పద్మ, కళ్యాణి, కవి నడిమెట్ల రామయ్య పాటలు పాడగా, సమైక్య సాహితీ మహిళా ప్రతినిధి నీలగిరి అనిత వందన సమర్పించారు.

## రైతు కమిషన్ కార్యాలయంలో ఘనంగా కె.వి.ఎన్. రెడ్డి జన్మదిన వేడుకలు





**హైదరాబాద్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతు కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యుడు కె.వి.ఎన్. రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి.కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, గోపాల్ రెడ్డి, భూమి సునీల్, కమిషన్ అధికారులు సంధ్యారాణి, హరి వెంకటప్రసాద్, పతాంజలి, స్రవంతి, రజిత, శ్రావ్యతో పాటు ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.చైర్మన్ కోదండరెడ్డి ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన కేక్‌ను కె.వి.ఎన్. రెడ్డి కట్ చేశారు. అనంతరం ఆయనకు శాలువాలు కప్పి, బొకేలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ, "పాలమూరు బిడ్డ కె.వి.ఎన్. రెడ్డి తన రాజకీయ జీవితం అంతా ప్రజల కోసమే అంకితం చేశారు. జలసాధన సమితి ఉద్యమం ద్వారా పాలమూరు జిల్లాకు సాగు, తాగునీరు తీసుకొచ్చిన ఘనత ఆయనదే. పదవుల కోసం తపించకుండా ప్రజల శ్రేయస్సే పరమావధిగా పనిచేసే నాయకుడు. ప్రస్తుతం రైతు కమిషన్ సభ్యుడిగా కొనసాగుతూ రైతుల కోసం ఎంతగానో కృషి చేస్తున్నారు" అని పేర్కొన్నారు.

## మైనార్టీలకు రంజాన్ తోఫా కిట్ల పంపిణీ



**వెల్దండ, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని మైనార్టీలకు రంజాన్ తోఫా కిట్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగింది.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. సర్పంచ్ యాదమ్మ మాట్లాడుతూ, "రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలను దృష్టిలో ఉంచుకొని రంజాన్ కిట్లను అందిస్తోంది. ముస్లిం సోదరులు ప్రశాంతంగా, ఆనందంగా పండుగ జరుపుకోవాలి" అని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బస్సమోని శ్రీను ముదిరాజ్, వార్డు సభ్యులు ముదిగొండ కవిత, రమేష్, కిష్టాలు, మారేపల్లి మంజుల, శ్రీను, శేఖర్, వెంకటేష్, మల్లీశ్వరి, రంగనాథం, నాయకులు జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, ఈదులపల్లి శీను, తుంగ శీను, మట్ట భరత్ గౌడ్, మైనార్టీ నాయకులు అమిద్, రషీద్, కలీం, మన్సూర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి జూపల్లి ఇంటిముందు ఆశా కార్యకర్తల ధర్నా



**కొల్లాపూర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొల్లాపూర్ పట్టణంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటి ముందు ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. వేతనంగా నెలకు రూ.18,000 ఫిక్స్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు నాగర్‌కర్నూల్ జిల్లా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్యతో పాటు పలువురు నాయకులు మద్దతు ప్రకటించారు.ఆశా కార్యకర్తలు నినాదాలు చేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మహిళా సమైక్య భవనానికి భూమి పూజ



**తలకొండపల్లి, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జల్ గ్రామంలో మంజూరైన మహిళా సమైక్య భవనానికి గురువారం భూమి పూజ ఘనంగా జరిగింది.గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ, డిప్యూటీ సర్పంచ్ శివ విజయలక్ష్మి, విజయకుమార్ కొబ్బరికాయ కొట్టి భూమి పూజను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సి. వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, మాజీ జెడ్‌పి కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రహమాన్, వార్డు సభ్యులు కవిత, ఆంజనేయులు, శేఖర్ యాదవ్, శ్రీశైలం, సుభాన్, ఎల్లమ్మ, శ్రీరాములు, లక్ష్మమ్మ, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఏ. అంజయ్య గౌడ్, మాజీ ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్ మూర్తి, అంబాజీ, మాజీ ఉపసర్పంచులు బి. నరసింహ, అజీజ్, మహిళా సమక్య అధ్యక్షురాలు షాహిన్ బేగం, టి. కృష్ణవేణి, పంచాయతీ సెక్రటరీ శరత్, సి.సి. శ్రీశైలం, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్, నాయకులు పి. అశోక్, వానరాశి వెంకటేష్, రాఘవేందర్, గట్టు శ్రీశైలం, వెంకటయ్య, వి. రాజు, పులిజల విష్ణు, గణేష్, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగానికి నిరాశ కలిగించే బడ్జెట్

-- రంగారెడ్డి తపస్




**హైదరాబాద్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026--27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో విద్యా రంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం నిరాశ కలిగించిందని తపస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశిరావు, పూజారి రమేశ్ విమర్శించారు.మొత్తం రూ.3,24,234 కోట్లలో విద్యా--మానవ వనరులకు కేవలం రూ.26,674 కోట్లు (8.2%) మాత్రమే కేటాయించారని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 15% హామీని నిలబెట్టుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు 33 నెలలుగా ఎదురుచూస్తున్న పీఆర్సీ, డీఏలపై ప్రస్తావన లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని అన్నారు.ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని స్వాగతిస్తున్నామని, అయితే దానిని ఉచితంగా అందించి సరిపడ నిధులు కేటాయించాలని, గురుకుల, మోడల్ స్కూల్, కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు కూడా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.ఉదయం అల్పాహారం, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజనం ప్రతిపాదనలు మంచివేనని, కానీ టీపీఎస్ ల ఏర్పాటుకు గత సంవత్సరం కంటే పెంచిన రూ.3,566 కోట్లు సరిపోవని పేర్కొన్నారు. కనీసం 18% నిధులు కేటాయించి విద్యారంగం, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వారు రాష్ట్ర బడ్జెట్‌ను సమీక్షించారు.

## భక్తిశ్రద్ధలతో జుమాతుల్ విదా



**ఆమనగల్లు, మార్చి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంజాన్ మాసం జుమాతుల్విదా (చివరి శుక్రవారం) నమాజును పట్టణ కేంద్రంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేశారు. మసీదుల్లో ముస్లింలు జమ్మతులివిదా ప్రత్యేక నమాజు చేశారు. మజీదుల్లో ఇమామ్ లు నమాజు చేయించడంతో పాటు దువా చేశారు. పేదలను ఆదుకోవాలని, వారి కష్ట, సుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో గడపాలని దైవాన్ని ప్రార్థించారు. పట్టణ కేంద్రంలోని జామియా మసీదు, మహమ్మదీయ మసీదు, హమాదే హీలాల్ మజీదుల్లో జరిగిన సామూహిక శుక్రవారం ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**ఇసిఐల్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఇసిఐల్‌లో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్పీఐ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్. కావేరి పాల్గొని మహిళా నాయకులను శాలువాలతో సన్మానించారు.కార్యక్రమంలో ఆర్పీఐ నాయకులు గాలి వినోద్‌కుమార్, మేజర్ చంద్రకాంత్, మైసయ్య, మహిళా నాయకులు వసంత, సిరి, లక్ష్మి, జానకమ్మ, సుజాత, దివ్య, రాష్ట్ర నాయకులు గుత్తికొండ కిరణ్, మేరుగు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.భక్తి, ఉత్సాహం నిండిన వాతావరణంలో మహిళా దినోత్సవం విజయవంతంగా ముగిసింది.

# ఆరేపల్లి గ్రామంలో ఘనంగా ఉగాది వేడుకలు



**శ్రీరాంపూర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలంలోని ఆరేపల్లి గ్రామంలో ఉగాది పండుగ వేడుకలు గ్రామ పంచాయతీ ఆవరణలో అత్యంత శోభాయమానంగా జరిగాయి.ఈ సందర్భంగా రాష్ట్ర దీప, దూప, నైవేద్య పథక అర్చక సంఘం అధ్యక్షుడు నిట్టూరి సతీష్ శర్మ నూతన తెలుగు సంవత్సరం పరాభవ నామ సంవత్సర జాతక విశేషాలను వివరించారు.గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పాలకవర్గ సభ్యులు, కుల సంఘ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొని ఆసక్తిగా జాతక విశేషాలు తెలుసుకొని ఆనందంగా వేడుకను జరుపుకున్నారు.

# ఎలిగేడు లో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



**ఎలిగేడు, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విప్‌గా నియమితులైన సందర్భంగా గురువారం రాత్రి ఎలిగేడు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, లాలపల్లె సర్పంచ్‌లు కప్పల ప్రవీణ్, ఏలేటి వెంకట్రెడ్డి, ఎలిగేడు ఉపసర్పంచ్ ముంజం నరేష్, మాజీ సర్పంచ్ మండిగ రాజనర్సయ్య, మాజీ ఉపసర్పంచులు కోరుకంటి వెంకటేశ్వరరావు, గుడుగుల మహేందర్, సీనియర్ నాయకులు చింతకుంట మనోహర్‌రావు, ముత్యాల మల్లేశం, ముంజం ముత్యాలు, సత్యనారాయణ, విద్యాసాగర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## 15 లక్షలతో సిసి రోడ్ పనులు ప్రారంభం



**ఎలిగేడు, మార్చి 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల కేంద్రంలోని 4వ వార్డు, 5వ వార్డులో ఈజీఎస్ పనులలో భాగంగా ఎమ్మెల్యే విజయ రమణారావు నిధులనుండి రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్ పనులను గురువారం గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉపసర్పంచ్ ముంజం నరేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే విజయ రమణారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు నరేందర్, న్యాతరి పోచాలు, మామిడాల రమేష్, పల్లె కార్తీక్, మధుకర్, అనిల్, శ్రీకాంత్, సమ్మయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

# వెల్దండ మండలంలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ ఆకస్మిక తనిఖీలు



**వెల్దండ, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్యాంప్రసాద్ లాల్ శుక్రవారం వెల్దండ మండలంలోని బొల్లంపల్లి, గుండాల, కొట్ర గ్రామాలను ఆకస్మికంగా సందర్శించారు.వెల్దండ గ్రామ పంచాయతీ పరిధిలోని చొక్కాన్నపల్లి గ్రామంలో రైతు రామకృష్ణ హార్టికల్చర్ క్రింద నాటిన మునగ తోటను పరిశీలించి, తోట నిర్వహణపై సూచనలు చేశారు. బొల్లంపల్లి గ్రామంలో రైతు నిర్మించిన పశువుల షెడ్, మొక్కలకు పాదులు, ఫెన్సింగ్ పనులను పరిశీలించి కూలీలతో ముచ్చటించారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిని పరిశీలించి, వచ్చే నెలలో గృహప్రవేశానికి సిద్ధంగా ఉండాలని లబ్ధిదారులకు సూచించారు.గుండాల గ్రామంలోని శివాలయం ఆవరణలో నిర్మించిన కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ వినియోగం, నిర్వహణపై సర్పంచ్‌తో చర్చించారు. అనంతరం కొట్ర గ్రామంలో మహిళా రైతులు ఏర్పాటు చేసిన కూరగాయల పెంపకం షెడ్‌ను పరిశీలించి, లాభాల అర్జనకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌తో పాటు చిన్న ఓబులేసు, డిఆర్డిఓ చంద్రశేఖర్, ఎంపీడీవో కృష్ణయ్య, ఏపిడి లక్ష్మణ్, ఎంపీఓ ఈశ్వర్, ఏపిఓ జంగయ్య, ఏపిఎం సంతోష్, దేవేందర్, ఈసి సత్యనారాయణ, టి.ఏ. అన్నపూర్ణ, వాణి, భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, బొల్లంపల్లి సర్పంచ్ సత్తూరి ప్రసాద్, జే. శిరీష, ఐకేపి సిసిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏషియన్ పెయింట్ డ్రైవర్ల పోరాటానికి విజయవంతమైన ముగింపు



**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం సదాశివపల్లి గ్రామంలోని ఏషియన్ పెయింట్ గోదాం ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లు గత 31 రోజులుగా చేపట్టిన సమ్మె విజయవంతమైంది. డ్రైవర్ల డిమాండ్లపై యజమాన్యం చర్చలకు దిగడంతో, వారి సమస్యలను పరిష్కరించేందుకు అంగీకరించింది. దీంతో డ్రైవర్లు సమ్మె విరమించారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ, డ్రైవర్ల ఐక్య పోరాటం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఎర్రజెండా కింద పోరాడితే ఏదైనా సాధ్యమవుతుందని ఈ విజయంతో మరోసారి నిరూపితమైందని అన్నారు.లారీ డ్రైవర్లు, టాటా ఏసీ డ్రైవర్లు, రైస్ మిల్ ఆపరేటర్లు, హరిత బయోటిక్ సంఘాలు ఏషియన్ పెయింట్ డ్రైవర్ల యూనియన్‌కు సంఘీభావం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. డ్రైవర్ల హక్కుల కోసం సిఐటియు నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కామల్ల మహిపాల్, కార్యదర్శి కీసర మల్లేశం, కోశాధికారి వెంకటేష్, సహాయ కార్యదర్శి మూగ తిరుపతి, వెంకట్ రెడ్డి, రమేష్, మహేష్, నాయక్, శ్రీకాంత్, సాయి, అనిల్, రాజశేఖర్, మధు, మోహన్, లక్ష్మణ్, కుమార్, సాగర్, సంజయ్, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రేకుర్తి వైద్యశాలను వీక్షించిన ఐడిబిఐ కార్పొరేట్ ఆఫీసర్లు



**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఈ రోజు ఉదయం ఐడిబిఐ కార్పొరేట్ ఆఫీసర్లు జానకిరామన్ సిజిఎం, వెంకటేశ్ డీజీఎం, శ్రీనివాస్ మేనేజర్, శ్రీధర్ కోలిపాకతో పాటు మరికొంతమంది అధికారులు రేకుర్తి వైద్యశాలను సందర్శించారు. ఇటీవల ఐడిబిఐ నుండి సిఎస్ఆర్ గ్రాంట్ కింద రూ.70,20,800 మాడ్యులర్ థియేటర్స్ నిర్మాణానికి, పేషెంట్ల రవాణా కోసం బస్సు అందించబడింది. ఆ నిధులను వినియోగించిన విధానాన్ని పరిశీలించడంతో పాటు నిర్మించిన ఆపరేషన్ థియేటర్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కొండ వేణుమూర్తి మాట్లాడుతూ లాసిక్ మిషన్ కోసం సుమారు నాలుగు కోట్ల సహాయం అందించాలని కోరారు. దీనిపై జానకిరామన్ సానుకూలంగా స్పందించి వచ్చే ఆర్థిక సంవత్సరంలో పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిదుర సురేశ్, ప్రకాశ్ హోల్, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ముక్క శరత్ కృష్ణ, శివకాంత్, సింగంరాజు, ప్రవీణ్ చావ్లా తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్





**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు జీడిగే సాయికృష్ణ ఆధ్వర్యంలో ఈ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు నిధులు కేటాయించలేదని, ఈ సంవత్సరం బడ్జెట్ సమావేశాల్లో నిధులు మంజూరుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ, 66వ డివిజన్ కార్పొరేటర్ వంగల పవన్ కుమార్, మహాసభ వాణిజ్య సెల్ కన్వీనర్ దేవిశెట్టి రమేష్, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆకుల మెహర్, జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు కైలాస నవీన్, యువజన సంఘం ఉపాధ్యక్షుడు సిరిపురం మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

## శివాలయం పునర్నిర్మాణ స్థల పరిశీలన



**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ఈరోజు సాయంత్రం కరీంనగర్ 50వ డివిజన్ పరిధిలోని జ్యోతినగర్ కేడీఆర్ పార్కును సందర్శించారు. ఈ పార్కు స్థలంలో శిథిలావస్థలో ఉన్న శివాలయ పునర్నిర్మాణంపై స్థానికులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ 50వ డివిజన్ ప్రచారానికి వచ్చినప్పుడు స్థానిక ప్రజలు కేడీఆర్ పార్క్‌లో శివాలయ పునర్నిర్మాణం చేయాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి, కార్పొరేటర్‌గా బోయినిపల్లి ప్రవీణ్ రావు గెలిస్తే శివాలయ పునర్నిర్మాణ పనులు చేపడతానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు విద్యారణ్య భారతి స్వామి ఈరోజు కరీంనగర్‌కు రావడంతో, బండి సంజయ్ విజ్ఞప్తి ప్రకారం ప్రవీణ్ రావుతో కలిసి కేడీఆర్ పార్కును సందర్శించి శివాలయ పునర్నిర్మాణ పనులపై చర్చించారు.

# కాంగ్రెస్ బడ్జెట్‌పై బీజేపీ విమర్శలు

**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026--27 వార్షిక బడ్జెట్ అత్యంత నిరాశాజనకమని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు విమర్శించారు. ఆయన మాట్లాడుతూ, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బహుశా గత ఏడాది బడ్జెట్‌ను మళ్లీ చదివారేమో అన్న అనుమానం కలుగుతోందని అన్నారు. రైతు భరోసా, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సాయం వంటి హామీలు బడ్జెట్‌లో కనిపించకపోవడం ప్రజా వంచన అని పేర్కొన్నారు. రాష్ట్రానికి మరో లక్ష కోట్లు అప్పు భారం మోపేందుకు సిద్ధమవ్వడం సిగ్గుచేటు అని అన్నారు. రైతు భరోసా నిధులు ఎగ్గొట్టడం, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు రూపాయి సాయం అందకపోవడం, మహిళలకు ఇచ్చిన హామీలు గాల్లో కలవడం కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థులకు భరోసా కార్డు పేరుతో రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి రూపాయి కూడా కేటాయించకపోవడం, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించలేని పరిస్థితి, విద్యా రంగానికి కేవలం 8%





కేటాయించడం తీవ్ర నిర్లక్ష్యమని అన్నారు. బీసీలకు 56% జనాభా ఉన్నా కేవలం 4% కేటాయింపులు చేయడం అన్యాయం అని, ఎస్సీ, ఎస్టీలకు సరైన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. మైనారిటీలకు మాత్రం గతేడాదికంటే ఎక్కువ నిధులు కేటాయించడం ఓటు బ్యాంక్ రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. దేవాలయాల విషయంలో వివక్ష చూపుతూ అర్చకుల వేతనాలు పెంచకపోవడం, ధూప దీప నైవేద్యాలకు నిధులు పెంచకపోవడం ఆధ్యాత్మిక రంగంపై నిర్లక్ష్యమని విమర్శించారు. హైదరాబాద్ నగరానికి జీహెచ్ఎంసీ బడ్జెట్ కేటాయించకపోవడం అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. ఇది అభివృద్ధి బడ్జెట్ కాదు, ప్రచార బడ్జెట్. హామీలు పెద్దవి, అమలు సున్నా. అంకెల గారడీతో ప్రజలను మోసం చేసే బడ్జెట్ అని యాదగిరి సునీల్ రావు తీవ్రంగా విమర్శించారు.

## ఘనంగా ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు



**మల్కాజిగిరి, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ జన్మదిన సందర్భంగా శామీర్‌పేట నివాసంలో ఘనంగా వేడుకలు జరిగాయి. కరీంనగర్ వాసులు సహా పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గం జమ్మికుంట మాజీ సర్పంచ్ సురేందర్ రాజు, మాజీ జడ్పీటీసీ శ్రీరాం శామ్ ఆధ్వర్యంలో రూపాయి నాణేలతో నిర్వహించిన తులాభారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒగ్గు డోలు, కోయ నృత్యాలు, డప్పు కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు మరింత రంజింపజేశాయి. వేల సంఖ్యలో వచ్చిన వారందరినీ ఆత్మీయంగా పలకరించిన ఈటల రాజేందర్, ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## ఉద్యోగాలు రాని ఉద్యమ కళాకారుల ఆవేదన



**హుస్నాబాద్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: ఉద్యమ నిరుపేద కళాకారులకు సాంస్కృతిక శాఖలో ఉద్యోగాల కల్పన అందని ద్రాక్షలాగే మిగిలిపోయిందని హుస్నాబాద్ కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా జీవో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించి మూడు నెలలు గడుస్తున్నా, సాంస్కృతిక శాఖ పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, సాంస్కృతిక శాఖ చైర్మన్ వెన్నెల గద్దర్, సలహా మండలి సభ్యులు ఉద్యమ కళాకారుల సమస్యలను విస్మరించారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం కోసం ఆడి పాడిన పేద కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో కళాకారులు నిరాశ చెందుతున్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోతే మళ్లీ రోడ్డెక్కి రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై బీజేపీ విమర్శలు

**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు పెద్ద మోసం, ప్రజా వంచనగా మారాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రంగా విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వంద రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు వెయ్యి రోజులు గడిచినా ఒక్క గ్యారెంటీ కూడా సక్రమంగా అమలు చేయలేకపోయిందని ఆయన మండిపడ్డారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, మహిళలకు నెలకు రూ.2500, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, నిరుద్యోగ భృతి, పెన్షన్ పెంపు, చేయూత పథకం వంటి హామీలు అన్నీ గాల్లో కలిసిపోయాయని అన్నారు. రైతులకు రూ.15 వేల భరోసా ఇస్తామని చెప్పి రూ.12 వేలకే పరిమితం చేయడం



రైతాంగాన్ని మోసం చేయడమేనని విమర్శించారు. బడ్జెట్‌లో కూడా 6 గ్యారెంటీలకు కేటాయింపులు లేకపోవడం ప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్టేనని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్ అంకెలు, మాటలు ఘనంగా కనిపించినా, వాస్తవానికి అవి గారడీ మాత్రమేనని అన్నారు. బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ, బల్దియాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూపిందని, పట్టణ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాల విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యకు, చేనేత కార్మికులకు సరైన నిధులు కేటాయించకపోవడం నిర్లక్ష్యమని



అన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే బీజేపీ చూస్తూ ఊరుకోదని, ప్రజలకు అండగా నిలిచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసి అయినా అమలు చేయిస్తామని గంగాడి కృష్ణారెడ్డి హెచ్చరించారు.

# రంజాన్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, మార్చి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

పవిత్ర రంజాన్ పండుగను ముస్లిం సోదరులందరూ శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం ఒక



ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, మత సామరస్యానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన ప్రతి ఒక్కరికీ ఈ పండుగ సుఖసంతోషాలను, ఆరోగ్యాన్ని చేకూర్చాలని శుభాకాంక్షలు తెలిపారు.

# సమన్వయంతో బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్



**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లాలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు.అడిషనల్ కలెక్టర్ కార్యాలయంలో విద్య, ఆరోగ్య, మహిళా సంక్షేమ, డిఆర్డిఏ, ఎస్సీ--ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులతో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కరీంనగర్ మాతా శిశు ఆసుపత్రి, జమ్మికుంట, హుజురాబాద్ ఏరియా ఆసుపత్రుల్లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కొనసాగుతోందని తెలిపారు. ఆసుపత్రులకు సమీపంలోని పాఠశాలల్లో 14 సంవత్సరాలు నిండిన బాలికలకు టీకాలు వేయాలని సూచించారు. అర్హులందరి జాబితా సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నిర్దిష్ట సమయానికి, తేదీల ప్రకారం వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడి టీచర్ల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్యునైజేషన్ అధికారి సాజిత, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ నాగలేశ్వర్, ఆర్ఎమ్ఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# భారత సైన్యంలో నియామకానికి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం



**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

భారత సైన్యంలో వివిధ విభాగాల్లో నియామకానికి సంబంధించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. అగ్నివీర్ విభాగాల్లో అవివాహిత యువత కోసం నియామక ప్రకటన 2026 ఫిబ్రవరి 13న- వెబ్‌సైట్‌లో విడుదలైంది. సికింద్రాబాద్ ఆర్మీ నియామక కార్యాలయ పరిధిలోని తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.ఈ నియామకం అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (10వ తరగతి), అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (8వ తరగతి) విభాగాల్లో జరుగుతుంది. అభ్యర్థులు తమ అర్హతల ఆధారంగా రెండు విభాగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ట వయోపరిమితి 21 సంవత్సరాల నుండి 22 సంవత్సరాలకు పెంచబడింది.ఆన్‌లైన్ సాధారణ ప్రవేశ పరీక్ష తెలుగు సహా 13 భాషల్లో నిర్వహించబడుతుంది. ఐటీఐ, డిప్లొమా, ఎన్‌సిసి అర్హతలు కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు లభిస్తాయి. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 2026 ఏప్రిల్ 1. పరీక్ష తాత్కాలికంగా 2026 జూన్ 1 నుండి జూన్ 15 వరకు జరుగుతుంది. ప్రవేశ పత్రాలు అదే వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలి.అభ్యర్థులు తాజా సమాచారం కోసం - వెబ్‌సైట్‌ను తరచూ పరిశీలించాలని, నమోదు చేసిన ఈ-మెయిల్ ఐడీలను చెక్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం సికింద్రాబాద్ ఆర్మీ నియామక కార్యాలయాన్ని 040-27740059 నంబర్ ద్వారా సంప్రదించవచ్చు.నియామక ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్, నిష్పక్షపాత, పారదర్శకంగా జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. మధ్యవర్తులు లేదా మోసగాళ్లు ఉద్యోగం కల్పిస్తామని చెప్పినా నమ్మరాదు. కేవలం కష్టపడి సిద్ధమవడం ద్వారా మాత్రమే మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.

## నూతన గృహప్రవేశ వేడుకల్లో కౌన్సిలర్లు



**ఆమనగల్లు, మార్చి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు శంకర్ నాయక్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో శుక్రవారం ప్రముఖ సంఘ సేవకులు , 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శంకర్ నాయక్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, అనిత శ్రీనివాస్ రెడ్డి లను శాలువాతో ఘనంగా సత్కరించారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ ఇల్లు ముట్టడి విజయవంతం

**కరీంనగర్, మార్చి 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




కరీంనగర్ మంకమ్మ తోటలోని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటిని ఆశా కార్యకర్తలు ఈరోజు ముట్టడించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఎక్కడికక్కడ ఆశా కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. పలువురికి గాయాలు కావడంతో పరిస్థితి ఉద్రిక్తమైంది.ఆశా కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేయగా, మంత్రి కార్యాలయం ముట్టడి విజయవంతమైందని సీఐటీయూ నాయకులు తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా మేల్కొని ఆశా వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముకుంద రెడ్డి మాట్లాడుతూ, ఆశా వర్కర్స్ సమస్యలను పరిష్కరించకుండా అక్రమ అరెస్టులు, నిర్బంధ పాలన ద్వారా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. జీతం పెంచకపోవడం, ఫిక్స్ వేతనం నిర్ణయించకపోవడం, పని భారం పెంచడం, డ్యూటీ చార్ట్ లేకుండా అన్ని పనులకు వాడుకోవడం అన్యాయమని అన్నారు. వైద్యరంగానికి 10% నిధులు కేటాయించి ఆశా వర్కర్స్‌కు రూ.18,000 ఫిక్స్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ళ శ్రీలత మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.18,000 హామీని నెరవేర్చాలని కోరారు. కేంద్రం జారీ చేసిన రూ.1500 పారితోషక పెంపు ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని, ఇన్సూరెన్స్ పాలసీ రూ.50 లక్షలు, మృతి ఖర్చులు రూ.50 వేల రూపాయలు ఇవ్వాలని, ఏఎన్‌సీ, పీఎన్‌సీ టార్గెట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.పెండింగ్ బిల్లులు, లెప్రసీ సర్వే, పల్స్ పోలియో, ఎన్నికల డ్యూటీకి సంబంధించిన చెల్లింపులు వెంటనే ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాల్వ సారిక, ఉపాధ్యక్షులు నాగెల్లి పద్మ, సుమలత, ప్రియాంక, సత్యలక్ష్మి, శ్యామల, లత తదితరులు పాల్గొన్నారు. మొత్తం 300 మంది ఆశా కార్యకర్తలు ఈ ముట్టడిలో పాల్గొన్నారు.

# ఘనంగా కామ్రేడ్ దానూ నాయక్ వర్ధంతి

**అమ్రాబాద్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**





కామ్రేడ్ దానూ నాయక్ 77వ వర్ధంతి సభల పోస్టర్‌ను తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధర్మ నాయక్, ప్రొఫెసర్ శంకర్ నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్ విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 1950 మార్చి 20న కామ్రేడ్ దానూ నాయక్ వీరమరణం పొందారని గుర్తు చేశారు. ఆయన పోరాట చరిత్రను భావితరాలకు అందించేందుకు ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా వర్ధంతి సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు.జనగాం తాలూకాలో దొరలు, రజాకార్లు లంబాడీ గిరిజనులపై సాగించిన దుర్మార్గాలకు వ్యతిరేకంగా కామ్రేడ్ దానూ నాయక్ తన అన్నదమ్ములతో కలిసి కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర మహాసభ అండతో తిరుగుబాటు చేశారని, కుటుంబం మొత్తం ప్రాణత్యాగం చేసిన అరుదైన చరిత్రలో వీరి కుటుంబం మొదటి వరసలో నిలుస్తుందని పేర్కొన్నారు.దానూ నాయక్ ధైర్యం, మొండితనం సైన్యాధికారులను కూడా ఆశ్చర్యపరిచిందని, చివరకు ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఆయన శత్రువుల చేతిలో చిక్కి, దారుణంగా హతమయ్యారని గుర్తు చేశారు.ఈ ఏడాది వర్ధంతి సభలను తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, గిరిజనులు, ప్రజలు, అభ్యుదయవాదులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శంకర్ నాయక్, బంజారా సంఘం అధ్యక్షుడు హాము నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్, ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.రఘు గోపాల్ నాయక్, ఆర్.పాండు గోన నాయక్, హరీష్ నాయక్, తెలంగాణ గిరిజన సంఘం నాయకులు వీ.రామ్ కుమార్, బహుజన పార్టీ రాష్ట్ర నాయకులు భౌగోణ ఎం.గోపీ, శివ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన దేవదాయ శాఖ కమిటీకి సన్మానం



**మహేశ్వరం, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధిలోని పెద్దపులి నాగారం గ్రామంలో ఉగాది పర్వదినం సందర్భంగా నూతన దేవదాయ శాఖ కమిటీని ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు.గత రెండు సంవత్సరాలుగా దేవాలయానికి సేవలందిస్తున్న అమీర్పేట యాదగిరి ముదిరాజ్ మరల కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డారు. ఆయన మాట్లాడుతూ, “భగవంతుని ఆశీస్సులతో మరోసారి సేవ చేసే అవకాశం లభించింది. దీనికి సహకరించిన గ్రామ ప్రజలకు, పెద్దలకు, మాజీ సర్పంచులకు, ఎంపిటిసిలకు, ప్రస్తుత గ్రామ సర్పంచ్ బండారి లింగం, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు” అని తెలిపారు.ఈ కమిటీలో అధ్యక్షుడిగా అమీర్పేట యాదగిరి, ఉపాధ్యక్షుడిగా యాదగిరి నరసింహ, ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరం రాజేష్, కోశాధికారిగా బొమ్మ దేవేందర్ బాధ్యతలు స్వీకరించారు.కార్యవర్గ సభ్యులుగా జెల్లా బాలరాజ్, కొమ్మెర రఘుపతి రెడ్డి, బూర్గుల నవీన్ కుమార్, పోగుల మల్లేష్, గాజులపల్లి నరసింహ, తోట్ల నరసింహ, రాసుల రాఘవేందర్, యాదగిరి రాజు, ఆయిల మహిపాల్ గౌడ్, గణపురం రాజు, మల్లెల శరత్ రెడ్డి, కుండే ఈశ్వరయ్య తదితరులు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఎన్నుకోబడ్డారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లు కేటాయింపు



**హుస్నాబాద్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లు కేటాయించడం పట్ల గిరిజన కాంగ్రెస్ నేత ధరావత్ తిరుపతి నాయక్ హర్షం వ్యక్తం చేశారు.శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకమైందని, అన్ని వర్గాల ప్రజలకు పెద్దపీట వేసి సంక్షేమానికి అత్యధిక నిధులు కేటాయించడం అభినందనీయమని అన్నారు.గిరిజనుల కోసం ప్రత్యేకంగా రూ.12,600 కోట్లు కేటాయించడం ద్వారా ‘ఇందర సౌర గిరి జల వికాసం’ పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా 100 శాతం సబ్సిడీతో సోలార్ పంపు సెట్లు అందించి, ఆరు లక్షల ఎకరాల పోడు భూముల్లో తోటల పెంపకాన్ని ప్రోత్సహించి, 2.10 లక్షల గిరిజన రైతులకు లబ్ధి చేకూర్చనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారని ఆయన గుర్తుచేశారు. అచ్చంపేటలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ పథకాన్ని అధ్యయనం చేసి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం గిరిజనులకు ఎంతో సంతోషకరమని డి.టి నాయక్ అన్నారు.

# జిల్లా ఆరోగ్య కేంద్రాలలో ఆకస్మిక తనిఖీ

**జమ్మికుంట, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ చెల్పూర్, వావిలాల, ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్శనలో హాజరు రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్, ఎన్‌సిడీ రిజిస్టర్, ఫార్మసీ స్టోర్లు, పిల్లల వ్యాధి నిరోధక టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ఆర్ మరియు దాని రోజువారీ ఉష్ణోగ్రత రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవుట్ పేషెంట్లను పలకరిస్తూ వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.స్టాఫ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ పీహెచ్సీ డెలివరీలను, మాతా శిశు ఆరోగ్య సేవలను మెరుగుపరచాలని సూచించారు. గర్భిణీ స్త్రీల చెకప్స్ సంఖ్యను పెంచాలని, అభా కార్డుల సృష్టి వేగవంతం చేయాలని ఆదేశించారు. 13 సంవత్సరాల పైబడిన వారందరికీ ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో స్క్రీనింగ్ చేసి, రీ-స్క్రీనింగ్ ద్వారా ఫాలోఅప్ చేయాలని సూచించారు. ప్రసూతి గది పరిశుభ్రతను పరిశీలించి, అందులో ఉండాల్సిన ప్రోటోకాల్ చార్టులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ తులసి దాస్, డాక్టర్ వరుణ, డాక్టర్ మధుకర్ మరియు సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్ పంట ముసుగులో గంజాయి సాగు...

**నల్లమల్లలో ఎక్సైజ్ అధికారుల తనిఖీలలో విషయం బహిర్గతం**





**అమ్రాబాద్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లమల్ల అటవీ ప్రాంతంలో వ్యవసాయం ముసుగులో గంజాయి సాగు జరుగుతున్న ఘటన వెలుగులోకి రావడం స్థానికంగా కలకలం రేపింది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పరిధిలోని పదరా మండలం వంకేశ్వరం గ్రామ శివారులో ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో ఈ అక్రమం బహిర్గతమైంది.గ్రామానికి చెందిన నినావత్ సెల్లి తిరుపతి దంపతులు తమ వ్యవసాయ భూమిలో మొక్కజొన్న పంట సాగు చేస్తూనే, అదే పొలంలో గంజాయి మొక్కలను అంతర్ పంటగా పెంచుతున్నట్లు అధికారులు గుర్తించారు. సాధారణ పంటల మధ్య మాదకద్రవ్య మొక్కలను పెంచడం ద్వారా అధికారుల దృష్టిని మాయ చేయాలనే ప్రయత్నం జరిగినట్లు తెలుస్తోంది.దాడుల సమయంలో ఆ పొలంలో మొత్తం 16 గంజాయి మొక్కలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదనంగా రవాణాకు సిద్ధంగా ఉంచిన 1.8 కిలోల గంజాయి కూడా పట్టుబడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులను వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణ తెలిపారు.నల్లమల్ల అటవీ ప్రాంతంలో మళ్లీ గంజాయి సాగు విస్తరిస్తున్న సంకేతాలు కనిపిస్తున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అప్రమత్తమైంది. అక్రమ సాగును నిర్మూలించేందుకు కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని కవచంగా చేసుకుని జరుగుతున్న ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద విషయాలను వెంటనే అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యారంగంపై చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ ప్రభుత్వం

**-ఎస్ఎఫ్ఐ, సిపిఐ విమర్శలు**









**కరీంనగర్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026--27 వార్షిక బడ్జెట్‌పై విద్యార్థి సంఘాలు, వామపక్ష పార్టీలు తీవ్ర విమర్శలు గుప్పించాయి.ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, చెప్పేది ఒక్కటి చేసేది ఒక్కటిగా మారిందని అన్నారు. మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో 3,24,234 కోట్లలో విద్యారంగానికి కేటాయించిన 26,674 కోట్లు కేవలం 8.22% మాత్రమేనని, మేనిఫెస్టోలో ఇచ్చిన 15% హామీని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ, కొత్తగా నిధులు కేటాయించకపోవడం విద్యార్థులను మోసం చేయడమేనని అన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.9,500 కోట్లకు పైగా పేరుకుపోయినా, వాటి చెల్లింపుపై స్పష్టమైన ప్రణాళిక లేకపోవడం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడటమేనని ఎస్ఎఫ్ఐ మండిపడింది. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా, కేవలం 100 కోట్లు కేటాయించడం నిర్లక్ష్యమని పేర్కొంది. తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికి కనీసం 30% నిధులు కేటాయించాలని, పెండింగ్ బకాయిలను చెల్లించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది.ఇక సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఆడంబరంగా అంకెల్లో భారీ బడ్జెట్ ప్రవేశపెడుతున్నా, అమలు చేయడానికి మాత్రం డబ్బులు లేకపోతున్నాయని అన్నారు. పేదలకు ఇండ్లు, పెన్షన్లు ఇవ్వకపోవడం దారుణమని, ఇందిరమ్మ ఇండ్లకు గతంలో కేటాయించిన 14 వేల కోట్లను పెంచాల్సింది పోయి కేవలం 7 వేల కోట్లు కేటాయించడం అన్యాయమని విమర్శించారు. విద్యకు 20% నిధులు కేటాయించాలని విద్యావేత్తలు సూచించినా, కేవలం 0.65% పెంపుతో 8%కే పరిమితం చేయడం చిన్న చూపు అని అన్నారు.కరీంనగర్ జిల్లా అభివృద్ధిపై బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేకపోవడం బాధాకరమని, మానేరు రివర్ ఫ్రంట్ కేబుల్ బ్రిడ్జి పనులకు, ప్రాజెక్టుల కాలువల నిర్మాణాలకు నిధులు కేటాయించకపోవడం జిల్లాకు అన్యాయం చేశారని పంజాల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో అంకెల గారడి

**- అభివృద్ధి శూన్యం**



అచ్చంపేట, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌పై అచ్చంపేట సిపిఎం మండల కార్యదర్శి సైదులు తీవ్ర విమర్శలు గుప్పించారు.రాష్ట్ర బడ్జెట్‌లో అంకెల గారడి తప్ప అభివృద్ధి వైపు అడుగులు లేవని ఆయన అన్నారు. యువత డిక్లరేషన్‌ను పూర్తిగా విస్మరించారని, నిరుద్యోగ భృతి రూ.4000 ఇస్తామని చెప్పి మాట కూడా నిలబెట్టలేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ ప్రస్తావనే లేకపోవడం వల్ల నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యారంగానికి నిధుల కేటాయింపు పూర్తిగా నిర్లక్ష్యమైందని ఆకునూరు మురళి సూచించినట్లు విద్యా కమిషన్ 5000 కోట్లు కేటాయించాలని కోరినా, నామమాత్రపు కేటాయింపుతో పాఠశాలలు, ఉన్నత విద్యను విస్మరించారని అన్నారు.నాగర్‌కర్నూల్ జిల్లాకు ఈ బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, పరిశ్రమలు వస్తాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశించిన ప్రజలకు నిరాశ మిగిలిందని తెలిపారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు పెంచకుండా పూర్తి చేయడం అసాధ్యమని, కొత్త సాగునీటి ప్రాజెక్టులకు కూడా తగిన నిధులు కేటాయించకపోవడం రైతాంగానికి ఇబ్బందికరమని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు మాటలకే పరిమితమైపోయాయని, రైతు భరోసా, మహిళలకు భృతి, అనేక హామీలు ఈ బడ్జెట్‌లో కూడా అమలు చేయకుండా విస్మరించారని విమర్శించారు.రాష్ట్ర బడ్జెట్‌ను తిరిగి పునర్‌పరిశీలించి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటికీ తగిన నిధులు కేటాయించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని, నాగర్‌కర్నూల్ జిల్లాకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఉప్పల్ కేంద్రియ విద్యాలయంలో అడ్మిషన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం



**ఉప్పల్, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉప్పల్ కేంద్రియ విద్యాలయం అధికారులు తెలియజేసిన ప్రకారం, వచ్చే విద్యా సంవత్సరం (2026--27) కొరకు విద్యార్థుల నుండి అడ్మిషన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఏప్రిల్ 2వ తారీఖు అని పేర్కొన్నారు. మొదటి తరగతి, మూడవ తరగతి సహా వివిధ తరగతులకు ఈ ప్రక్రియ వర్తిస్తుందని తెలిపారు.విద్యార్థులు, తల్లిదండ్రులు పూర్తి వివరాల కోసం కేంద్రియ విద్యాలయ సంఘం అధికారిక వెబ్‌సైట్ kvsangathan.nic.inను సందర్శించాలని సూచించారు.

# మాదిగల ఆత్మగౌరవాన్ని తొక్కిపెడితే కాంగ్రెస్‌కు రాజకీయ సమాధి తప్పదు

**-- ఎంఎస్ఎఫ్**



**అచ్చంపేట, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల కేంద్రంలో మీడియా సమావేశంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు బుక్కపురం మహేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తూ, పదవుల పంపకంలో మొండిచేయి చూపుతోందని ఆయన మండిపడ్డారు. తాజాగా ప్రకటించిన నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ కమిటీలో 32 మంది సభ్యుల్లో మాదిగలకు కేవలం ఒకరికి మాత్రమే చోటు కల్పించడం నిలువునా అవమానమని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 15 లక్షల మంది మాదిగలు ఉన్నా, అధ్యక్ష పదవుల దగ్గరికి వచ్చేసరికి మా జాతి ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, పాలమూరు అంటే మాదిగల జిల్లా డప్పులు కొట్టండి అన్న మాటలు మాదిగలను కూలీలుగా, డప్పుగాళ్లుగా మాత్రమే చూడటానికి అన్నవా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగలు కేవలం జెండాలు మోయడానికి, డప్పులు కొట్టడానికి పరిమితం కావాలా, నాయకత్వం వహించే అర్హత మాకు లేదా అని ఘాటుగా ప్రశ్నించారు.నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉద్దేశపూర్వకంగానే మాదిగ నాయకత్వాన్ని అణచివేస్తున్నారని, అగ్రవర్ణాల ఆధిపత్యంలో పార్టీని ఉంచి సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పార్లమెంట్ స్థానంలో కూడా మాదిగలకు అవకాశం ఇవ్వకపోవడం వెనుక పెద్ద కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు.తక్షణమే నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ కమిటీని రద్దు చేసి, జనాభా ప్రాతిపదికన మాదిగలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని మహేష్ డిమాండ్ చేశారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కూడా మాదిగలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని, దేశవ్యాప్తంగా సమాన ప్రాతినిధ్యం గురించి మాట్లాడే మాటలు ఇక్కడ కూడా అమలు కావాలని సూచించారు.మాదిగల ఆత్మగౌరవంతో ఆటలాడొద్దు. మా హక్కును మేం అడుగుతున్నాం. కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని మార్చుకోకపోతే అచ్చంపేట నుంచి మొదలయ్యే ఈ నిరసన జ్వాల రాష్ట్రవ్యాప్తంగా వ్యాపిస్తుంది. మాదిగల ఆగ్రహానికి కాంగ్రెస్ రాజకీయ సమాధి తప్పదు అని ఆయన గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐఎన్టియుసి పేరుతో చట్టవిరుద్ధ కార్యకలాపాలు

**చర్యలు తీసుకోవాలి: నడికుడ శివ**



**రంగారెడ్డి, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా ఐఎన్టియుసి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కార్మికుల హక్కుల పరిరక్షణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.మహేశ్వరం నియోజకవర్గ కార్మిక శాఖ అధ్యక్షుడు నడికుడ శివ మాట్లాడుతూ, "ఐఎన్టియుసికి అనుబంధం లేని హైదరాబాద్--రంగారెడ్డి రైస్ మిల్స్ అండ్ రైస్ ట్రేడర్స్ వర్కర్స్ యూనియన్ (ఏ4516) గత కొంతకాలంగా కార్మికుల హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తోంది. ఈ యూనియన్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో ఒప్పందాలు కుదుర్చుకుని కార్మికులకు రావలసిన గిట్టుబాటు ధరలు మరియు ఇతర హక్కులను కాలరాస్తోంది" అని ఆరోపించారు.అదేవిధంగా, తాము ఐఎన్టియుసికి అనుబంధమని తప్పుడు ప్రచారం చేస్తూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలను అరికట్టేందుకు సంబంధిత యూనియన్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కార్మిక అధికారిని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బిజ్జుల రామకృష్ణారెడ్డి, జిల్లా కన్వీనర్ సామ భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రవణ్‌కుమార్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు ఐలేష్ తదితర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# కల్వకోలు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు



**మహేశ్వరం, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధిలోని కల్వకోలు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది.గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ, రవి మాదిగ, మండల ఇంచార్జ్ ఎస్సీఆర్పి, ఏపీఎం సురేష్, ఎంజైరేగ్స్ ఈసీ ఆదిత్య లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సెక్రటరీ శ్రీనివాస్, వార్డు సభ్యులు తిరుమల యాదయ్య, శిరీష, మహేందర్, కొండని గీత, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.లబ్ధిదారులు మాట్లాడుతూ, "ప్రభుత్వం అందించిన ఇండ్లతో మా కుటుంబాలకు సురక్షిత నివాసం లభించింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు" అని సంతోషం వ్యక్తం చేశారు.

## 'శ్రీ పరాభవ' నామ సంవత్సర ప్రత్యేక పూజల్లో పాల్గొన్న తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు



**రంగారెడ్డి, మార్చి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పవిత్ర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని తెలంగాణ జాగృతి కేంద్ర కార్యాలయంలో నూతన సంవత్సర ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పాండురంగారెడ్డి, కుమారుడు కప్పాటి శివరామకృష్ణారెడ్డి, స్నేహితుడు సూరెడ్డి కార్తీక్‌రెడ్డి కలిసి కవితమ్మకు 'శ్రీ పరాభవ' నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.రాష్ట్ర ప్రజలందరికీ ఈ నూతన సంవత్సరం అన్ని రంగాల్లో విజయాన్ని చేకూర్చాలని ఆకాంక్షించారు.

# మహేశ్వరం నూతన సీఐకి సన్మానం



**మహేశ్వరం, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహేశ్వరం సీఐ ఎస్. రాఘవేందర్‌రెడ్డిని పెద్దపులి నాగారం గ్రామ సర్పంచ్ బండారి లింగం, 5వ వార్డు సభ్యుడు షాహబుద్దీన్ ఖాన్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా వారు సీఐకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా శాంతి--భద్రత కోసం ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు.

# సిద్ధాపూర్‌లో క్రషర్ మిషన్ దుమారం







### -- దళితవాడలో ప్రజల వేదన

**రంగారెడ్డి, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన క్రషర్ మిషన్ కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా దళితవాడలో టిప్పర్ లారీల రాకపోకల వల్ల ఎగిసే దుమ్ము ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.రాత్రింబగళ్లు బాంబులు పేల్చి రాళ్లు పగలగొట్టడం వల్ల ఇళ్లలోని వస్తువులు కంపిస్తున్నాయని, చిన్నపిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. 24 గంటల పాటు నిరంతరంగా టిప్పర్ లారీలు కంకర, మట్టిని రవాణా చేయడంతో రోడ్లపై రాళ్లు, మట్టి పేరుకుపోయి వాహనదారులకు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి.కోళ్లపడకల్, సిద్ధాపూర్, పల్లిగూడెం, జండాగూడెం, దుబ్బచెర్ల గ్రామాల మీదుగా భారీ వాహనాలు తిరుగుతూ శబ్ద, వాయు కాలుష్యాన్ని పెంచుతున్నాయి. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్, గ్రామ సెక్రటరీ వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, మైనింగ్ కార్యకలాపాలను నియంత్రించాలని ప్రజలు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు జంబరి కుమార్ మాట్లాడుతూ, "దళితవాడలో ఇళ్లకు తీవ్ర నష్టం జరుగుతోంది. టిప్పర్ లారీల వల్ల వచ్చే దుమ్ము ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. అధికారులు, గ్రామ సర్పంచ్, గ్రామ సెక్రటరీ వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎస్సీ సంక్షేమానికి 70% నిధుల కోత

### -- దళితుల అభివృద్ధి ఒట్టి బూటకం
### --పాలడుగు నాగార్జున, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు



**నల్లగొండ, మార్చి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి భారీగా నిధుల కోత విధించడం దళితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తోంది. గత బడ్జెట్‌లో రూ.40,232 కోట్లు కేటాయించగా, ఈసారి కేవలం రూ.11,784 కోట్లు మాత్రమే చూపించడం అన్యాయం. ఇది సుమారు 70 శాతం కోతగా నిలిచిందని దళితుల అభివృద్ధి పేరుతో మాటలు మాత్రమే చెప్పి, ఆచరణలో మాత్రం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని స్పష్టమవుతోంది. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం 'దళిత బంధు' పేరిట రూ.10 లక్షలు ఇస్తామని చెప్పి అమలు చేయలేకపోయింది. ప్రస్తుత ప్రభుత్వం 'అంబేద్కర్ ఓవర్సీస్' పథకం ద్వారా రూ.12 లక్షలు ఇస్తామని ప్రకటించినప్పటికీ, బడ్జెట్ లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దారుణమని దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి, ఇప్పుడు వారి సంక్షేమాన్ని పూర్తిగా పక్కన పెట్టడం బాధాకరం. దళితుల అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది.
అందువల్ల, ప్రభుత్వం వెంటనే బడ్జెట్‌ను సవరించి కనీసం రూ.50,000 కోట్లు ఎస్సీ సంక్షేమానికి కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దళితుల నుంచి పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

# మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు ప్రారంభం



**ఎలిగేడు, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.స్థానిక సర్పంచ్ కప్పల ప్రవీణ్, విద్యాధికారి ఏ. నరేంద్ర చారి జెండా ఊపి పోటీలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "స్పోర్ట్స్ స్కూల్‌లో సీటు సాధించిన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ, అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో అత్యాధునిక క్రీడా పరికరాలతో శిక్షణ లభిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్స్ ఒక గొప్ప వరం" అని పేర్కొన్నారు.ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ దేవేందర్‌రావు, మండల వ్యాయామ ఉపాధ్యాయులు కె. ప్రణయ్ (ఎలిగేడు), ఎల్. శ్రీనివాస్ (సుల్తాన్‌పూర్), వి. శ్రీకాంత్ (ధూళికట్ట) పాల్గొన్నారు.

# కనిపించిన నెలవంక శనివారం ఈద్-ఉల్-ఫిత్ర్

### తెలంగాణ జామియత్ ఉలేమా ఏ హింద్ అధ్యక్షులు -- మౌలానా ఎహసానుద్దీన్ ఖాస్మీ




**నల్లగొండ మార్చి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** శుక్రవారం నెలవంక కల్పించడంతో శనివారం ఈద్ ఉల్ ఫిత్ర్ (రంజాన్ పండుగ) జరుపుకోవాలని నిర్ణయం. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఈద్గా లో ఈద్-ఉల్-ఫిత్ర్ నమాజ్ ఉదయం 8:30 గంటలకు ఈద్ నమాజ్ ఉంటుందని తెలిపారు అదేవిధంగా మదీనా మస్జిద్ లో 8:00ఖఎ,అక్సా మసీదు లో 9:30ఖఎ,ఉస్మానియా మసీదు లో 8:00ఖఎ కు ఈద్ నమాజ్ (ఈద్-ఉల్-ఫిత్ర్) నిర్వహించనున్నట్లు ముస్లిం మత గురువులు తెలిపారు ఈద్ ను పునస్కరించుకుని ప్రార్ధనలకు పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరుకానున్నారని అంచనా వేసి ఏర్పాట్లు పూర్తి చేశారు(ఈద్-ఉల్-ఫిత్ర్) నమాజ్ కి ఈద్గా వచ్చేవారు తమ వెంట జానిమాజులు తీసుకుని రావాలని తెలిపారు.

# పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

### - ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు



**ఆమనగల్లు, మార్చి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పండుగలను అందరూ కలిసి మెలిసి ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు అన్నారు. రంజాన్, ఉగాది పండుగలను పురస్కరించుకొని బుధవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రంజాన్, ఉగాది పండుగలు వెనువెంటనే ఉన్నందున హిందూ ముస్లింలు కలిసికట్టుగా జరుపుకోవాలని సూచించారు. పండుగల సమయంలో ఒకరినొకరు గౌరవించుకోవాలని, దీంతో అందరి మధ్య సోదర భావం మరింత పెంపొందుతుందని తెలిపారు. దేవాలయాలు, మసీదుల వద్ద పూజలు, ప్రార్థనలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, ఎఎస్ఐ లు రాంరెడ్డి, మురళీధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, అవ్వారి శివలింగం, ఖాదర్ ఖాద్రి, కాలే మల్లయ్య, అబ్దుల్ అలీమ్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, కండె సాయి, దేవరశెట్టి మహేష్, నాజర్, కుమార్ గౌడ్, శివ, మల్లేష్, అహ్మద్, మహబూబ్ అలీ, జలాల్ తదితరులు ఉన్నారు.

# నీటి ఏనుగు దాడిలో పశు వైద్యురాలు మృతి



**బెంగళూరు, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వన్యప్రాణులకు చికిత్స చేసేందుకు వెళ్లిన వెటర్నరీ డాక్టర్ సమీక్షారెడ్డిపై ఒక నీటి ఏనుగు (హిప్పోపొటామస్) దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన బాధితురాలు చికిత్స పొందుతూ శుక్రవారం ప్రాణాలు కోల్పోయింది. కర్ణాటకలోని శివమొగ్గ సమీపంలోని త్యావరకొప్ప టైగర్, లయన్ సఫారీలో బెంగళూరుకు చెందిన సమీక్షారెడ్డి(27) కాంట్రాక్ట్ ఉద్యోగిగా సేవలు అందిస్తున్నది సన్‌కాపర్ పక్షికి చికిత్స చేసేందుకు గురువారం రాత్రి 10.30 గంటలకు సఫారీలోని పశు వైద్యశాలకు వెళ్లింది. చికిత్స అనంతరం అక్కడున్న నీటి ఏనుగు శరీర ఉష్ణోగ్రతను థర్మల్ కెమరాతో పరీక్ష చేస్తున్న సమయంలో అది దాడి చేసింది. దాడిలో అస్వస్థతకు గురైన డాక్టర్‌ను చికిత్స కోసం శివమొగ్గలోని మ్యాక్స్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మరణించిందని త్యావరకొప్ప ఈడీ డాక్టర్ అమరాక్షర వెల్లడించారు. ఆమె మృతిపై కర్ణాటక ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

# ఇన్‌ఫ్రారెడ్ వ్యవస్థతో ఎఫ్-35పై దాడి!

**వేడి సంకేతాలే స్టెల్త్ జెట్‌ని పట్టించాయా?**



**న్యూఢిల్లీ, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమెరికాకు చెందిన ఎఫ్-35 యుద్ధ విమానంపై దాడిచేసినట్లు ఇరాన్ చేసిన ప్రకటన ప్రపంచ దేశాలను ఉలికిపాటుకు గురిచేసింది. ఈ దాడిలో ఇన్‌ఫ్రారెడ్ గైడెడ్ గగన రక్షణ వ్యవస్థ కీలక పాత్ర పోషించి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతుండగా ప్రస్తుతం దీనిపై దర్యాప్తు జరుగుతున్నది. ఇరాన్ గగనతలంపై యుద్ధ మిషన్‌లో నిమగ్నమైన అమెరికా ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానం దెబ్బతినడంతో పశ్చిమాసియాలోని ఎయిర్ బేస్‌లో అత్యవసర ల్యాండింగ్ జరపాల్సి వచ్చినట్లు అమెరికా అధికారులు తెలిపారు. పైలట్ సజీవంగా ఉన్నారని, ఆయన పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు చెప్పారు. అయితే ఇరాన్ వాదనను పూర్తిగా ధృవీకరించని అమెరికా ప్రభుత్వం మాత్రం ఇరానియన్ కాల్పులు ఎఫ్-35ని తాకి ఉండవచ్చని అభిప్రాయపడింది. ప్రపంచంలోనే మొదటి దాడిగా ఇరాన్ ఈ ఘటనను అభివర్ణిస్తుండగా అత్యంత అధునాతన యుద్ధ విమానాన్ని ట్రాక్ చేసి మరీ ఎలా గురిపెట్టగలిగారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. భూమి నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే ఇరాన్‌కు చెందిన ఇన్‌ఫ్రారెడ్ గైడెడ్ వ్యవస్థలు రాడార్‌పై కాకుండా ఉష్ణోగ్రతలపైన ఆధారపడుతుండవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే రాడార్‌ను, ఇన్‌ఫ్రారెడ్ సంకేతాలకు దొరక్కుండా నిర్మించిన ఎఫ్-35 పూర్తిగా అదృశ్యం కాలేదు. ముఖ్యంగా హైస్పీడ్‌లో లేదా యుద్ధ విన్యాసాల్లో ఉన్నపుడు అది మరింత ఎక్కువగా ఉంటుంది. ఇరాన్ యుద్ధంలో అనేక ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లుసహా కనీసం 16 యుద్ధ విమానాలను అమెరికా కోల్పోయిన నేపథ్యంలో ఎఫ్-35పై దాడి ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మరి కొన్ని ఘటనలకు స్నేహపూర్వక కాల్పులను కారణంగా అమెరికా చూపింది. ఏదేమైనా అత్యంత శక్తివంతమైనవిగా అమెరికా భావిస్తున్న ఎఫ్-35 యుద్ధ విమానంపై ఇరాన్ గురిపెట్టడం ఆధునిక యుద్ధరంగంలో సవాలుగానే అమెరికా స్వీకరించాల్సి ఉంటుంది.

# ప్రీమియం పెట్రోల్‌పై రూ.2 పెంపు

**-బల్క్ డీజిల్‌పై రూ.22 అదనపు భారం**
**-యుద్ధం నేపథ్యంలో పెట్రో వాత మొదలు**

**న్యూఢిల్లీ, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో దేశంలో పెట్రో వాత మొదలైంది. దేశంలో శుక్రవారం ప్రీమియం లేదా హయ్యర్ గ్రేడ్ పెట్రోల్ ధర లీటరుకు రూ.2 చొప్పున పెరిగింది. అదే విధంగా పారిశ్రామిక వినియోగం కోసం కొనుగోలు చేసే బల్క్ డీజిల్ రేటు లీటరుకు దాదాపు రూ. 22 పెరిగింది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచ చమురు ధరలు పెరగడంతో ఈ పెంపు ఏర్పడింది. అయితే సాధారణ పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎటువంటి మార్పు లేదు. ప్రీమియం 95-ఆక్టేన్ పెట్రోల్ ధర ఢిల్లీలో లీటరు రూ. 99.89 నుంచి రూ. 101.89కి పెరిగింది. అదే విధంగా బల్క్ లేదా ఇండస్ట్రియల్ డీజిల్ ధర ఢిల్లీలో లీటరు రూ.87.67 నుంచి రూ. 109.59కి చేరుకుంది. ఇరాన్ యుద్ధం తీవ్రస్థాయికి చేరుకోవడంతో గురువారం అంతర్జాతీయ ముడి చమురు ధర బ్యారెల్ 119 డాలర్లు ఉంది.

# మహా రంజాన్.. నేడు ఈద్-ఉల్-ఫితర్






**- దర్శనమిచ్చిన షవ్వాల్ నెలవంక**
**- ప్రత్యేక ప్రార్థనలకు ఈద్గాలు ముస్తాబు**
**- ముగిసిన ఉపవాస దీక్షలు**

**ఆమనగల్లు, మార్చి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
షవ్వాల్ నెలవంక శుక్రవారం రాత్రి దర్శనమివ్వడంతో ముస్లింలు 30 రోజుల పాటు చేపట్టిన ఉపవాస దీక్షలు విరమించారు. శనివారం రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్)ను ఘనంగా జరుపుకోనున్నారు. ప్రత్యేక ప్రార్థనల కోసం ఈద్గా, మసీదులను ముస్తాబు చేశారు. పేద, ధనిక తేడా లేకుండా అందరూ కొత్త దుస్తులు ధరించి ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోనున్నారు. ముస్లింలు పెద్దసంఖ్యలో పట్టణ కేంద్రంలోని జామీయ మసీదు, మహమ్మదీయ మసీద్, హమాదే హీలాల్ తదితర మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఉన్న ఈద్గాను జామ మసీదు సభ్యులు రజక్, జబ్బర్, నయుమ్ లు జేసీబీ తో శుభ్రం చేశారు. ఇమామ్ అన్వార్ మౌలన ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజు నిర్వహించనున్నారు.

ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు..
పట్టణ కేంద్రాల్లోని ఈద్గా వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తాగునీరు, నీడ వసతి కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈద్గా వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. పండుగ సందర్భంగా శనివారం కిరాణం, దుస్తుల దుకాణాలు కిటకిటలాడాయి. రాత్రి పొద్దుపోయే వరకు దుస్తు దుకాణాలు తెరుచుకొని కనిపించాయి.

# మూడు గ్రామాల్లో విస్తృత పర్యటన చేసిన డీఎల్పీవో దేవకీదేవి





**ఎలిగేడు, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని శివపల్లి, ఎలిగేడు, రాములపల్లి గ్రామాల్లో శుక్రవారం డీఎల్పీవో దేవకీదేవి విస్తృత పర్యటన చేపట్టి పరిశీలించారు. శివపల్లిలో ఇంటింటి నుండి తడి, పొడి చెత్తను వేరు వేరు సేకరించాలని సూచించారు. నర్సరీ నిర్వహణ తీరు, మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఎలిగేడు గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థులు కృషి చేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. రాములపల్లిలో గ్రామపంచాయతీ రికార్డుల నిర్వహణను పరిశీలించి, ఎప్పటికప్పుడు రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో కిరణ్, సర్పంచులు దుగ్యాల వాణి, కప్పల ప్రవీణ్, సిద్ధి తిరుపతి యాదవ్, ఉపసర్పంచులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బయలు నాటకం





**వెల్దండ, మార్చి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బయలు నాటకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన ఈ సాంప్రదాయ కళారూపం ద్వారా మహావిష్ణువు అవతారమైన శ్రీ చెన్నకేశవ స్వామి జీవిత విశేషాలు, మహిమలు ప్రజలకు ఆవిష్కరించబడ్డాయి. మార్చి 17 నుండి 20 వరకు మూడు రాత్రులపాటు యథావిధిగా కొనసాగిన ఈ నాటక ప్రదర్శనలు గ్రామ ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గ్రామ ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొని, భక్తిశ్రద్ధలతో వీక్షించారు. ఈ





కార్యక్రమంలో శ్రీ చెన్నకేశవ స్వామి భక్తబృందం విశేషంగా పాల్గొని నాటకాన్ని విజయవంతం చేశారు.



# ధురంధర్ –2కు మంచి రెస్పాన్స్

దేశభక్తి అంశాలతో కూడిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' ఓ ట్రెండ్ సెట్ చేసింది. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ మూవీ సీక్వెల్ 'ధురంధర్ 2' కూడా బాక్సాఫీసు వద్ద దూసుకెళుతోంది. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నటుడు రాకేశ్ బేడీ ఈ విజయంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ రెండు సినిమాల్లో కీలకమైన జమీల్ జమాల్ పాత్ర పోషించిన ఆయన.. తన పెర్ఫామెన్స్‌పై హీరో రణ్‌వీర్ సింగ్ ఇచ్చిన ప్రశంసను గుర్తుచేసుకున్నారు. ఈ చిత్ర బృందమంతా సెట్స్‌లో కలివిడిగా ఉండేది. నా పాత్ర షూటింగ్ పూర్తయిన రోజు.. రణ్‌వీర్ మైక్ తీసుకొని 'ఒకవేళ ఈ మూవీ రూ.1000 కోట్లు వసూలుచేస్తే.. అందులో రూ.500 కోట్లు రాకేశ్ వల్లే వస్తాయి' అని చెప్పారు. ఓ నటుడిగా ఇంతకుమించి ఏం కావాలి?' అని పేర్కొన్నారు. సీనియర్ పొలిటీషియన్‌గా నయవంచక పాత్రలో రాకేశ్ బేడీ అదరగొట్టారు. ముఖ్యంగా 'ధురంధర్ 2'లో ఈ పాత్ర ఇచ్చే ట్విస్ట్ ప్రేక్షకులకు ఓ ట్రీట్. బాలీవుడ్‌లో 47 ఏళ్ల ప్రస్థానం రాకేశ్ బేడీది. 'ధురంధర్' డైరెక్టర్ ఆదిత్యధర్ గతంలో తెరకెక్కించిన మరో హిట్ మూవీ 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్'లోనూ నటించారు. సినీప్రియుల ఆసక్తిని దృష్టిలోపెట్టుకొని 'ధురంధర్ 2'ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసిన సంగతి తెలిసిందే. తొలిరోజే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ప్రపంచవ్యాప్తంగా రూ.172 కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. నెట్ పరంగా రూ.145 కోట్లు అని పేర్కొన్నాయి. ఇందులో దాదాపు రూ.100 కోట్లు హిందీలోనే రావడం గమనార్హం. పెయిడ్ ప్రివ్యూల ద్వారా రూ.40? కోట్లు వచ్చాయని తెలిసింది. నెట్ కలెక్షన్లలో ఫస్ట్‌డే అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ మూవీగా 'ధురంధర్ 2' రికార్డులు నెలకొల్పింది.



## హాట్ హాట్‌గా జబర్దస్త్ వర్ష..

# ఉస్తాద్ భగ్ సింగ్ హిట్ టాక్

## దర్శకుడు హరీష్ శంకర్ ఆనందం




ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా బాగుందన్న అభిప్రాయం రావడం ఎంతో ఆనందాన్నిచ్చిందని దర్శకుడు హరీష్‌శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో... పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్.వై సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఉగాది సందర్భంగా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్ అభిమానులు ఫోన్ చేసి 'అన్నా సినిమా చాలా బాగుంది' అంటున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చేలా సినిమాని మలిచాం. తొలి రోజు నుంచీ ఓ కమర్షియల్ సినిమా తీస్తున్నానని, ఒకప్పటిలా హుషారైన పవన్‌కల్యాణ్ ఇందులో కనిపిస్తారని చెబుతూ వచ్చా. సినిమా చూసినవాళ్లు ఈ సినిమాలో ఇన్ని అంశాలు ఉన్నాయని మాకు తెలియదంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇందులోని ప్రతి పాత్ర బాగా పండింది. అందరికృషితోనే ఇంత మంచి సినిమా చేయగలిగాం అన్నారు. నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ థియేటర్ల దగ్గర పండగ వాతావరణం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అమెరికా అనే తేడా లేకుండా అన్ని చోట్లా ప్రేక్షకులు సినిమాని ఆస్వాదిస్తున్నారు. మేం ఊహించిన దానికంటే మంచి స్పందన వచ్చింది. పవన్ కల్యాణ్ వన్ మేన్ షో ఇది. హరీశ్‌శంకర్ ఎంతో బాధ్యతగా 'గబ్బర్‌సింగ్' సినిమాని మించేలా తెరకెక్కించారు. కచ్చితంగా భారీ వసూళ్లు సాధిస్తుందీ చిత్రం' అన్నారు. నిర్మాత రవిశంకర్.వై మాట్లాడుతూ 'పెద్ద హీరో నుంచి వాణిజ్య ప్రధానమైన సినిమా వచ్చి చాలా కాలమైంది. ఇందులో కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలూ ఉన్నాయి. మాకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఈ సినిమా విజయంపై మేం సంతోషంగా ఉన్నాం' అన్నారు. ఈ కార్యక్రమంలో కళా దర్శకుడు ఆనంద్‌సాయి, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.



# అది బ్రేకింగ్ న్యూస్ కాదు!



అగ్ర కథానాయిక అనుష్క శెట్టి ఓ వ్యాపారవేత్తతో పెళ్లిపీటలెక్కబోతున్నదని గత కొన్ని రోజులుగా సోషల్‌మీడియాలో వార్తలొస్తున్నాయి. తాజాగా వీటిని ఆమె వ్యక్తిగత టీమ్ ఖండించింది. ఈ మేరకు శు క్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఒకరి వ్యక్తిగత జీవితం గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించింది.'అనుష్క శెట్టి వయసుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వార్తల్ని ప్రచారం చేస్తున్నారు. మరి హీరోల వయసు విషయంలో మీలో ఆ ఉత్సాహం ఎందుకు కనిపించడం లేదు?' అని ప్రశ్నించింది. 'తన వ్యక్తిగత జీవితం విషయంలో అనుష్క గోప్యతను పాటిస్తుంది. పెళ్లి అనేది వ్యక్తిగత విషయం. అది బ్రేకింగ్ న్యూస్ ఎంత మాత్రం కాదు. వార్తల్ని ప్రచురించే ముందు నిజానిజాలేమిటో తెలుసుకోం డి' అంటూ అనుష్క టీమ్ పేర్కొన్నది.

# సర్కే చునార్ తేరి సర్కే పాట వివాదం

## -నోరా ఫతేహీపై ముస్లిం సంస్థ ఫత్వా జారీ




కన్నడ చిత్రం 'కేడీ: ద డెవిల్' లోని 'సర్కే చునార్ తేరి సర్కే' పాట తీవ్ర వివాదాలకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఈ పాటలో నటించిన బాలీవుడ్ నటి నోరా ఫతేహీపై అలీగఢ్‌కు చెందిన ముస్లిం పర్సనల్ దారుల్ ఇఫ్తా అనే మతపరమైన సంస్థ ఫత్వా జారీ చేసింది. ఈ పాటలోని సాహిత్యం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధంగా ఉందని సదరు సంస్థ పేర్కొంది. ఇటువంటి ప్రదర్శనలు సమాజంలో తప్పుడు సందేశాన్ని పంపుతాయని, ముఖ్యంగా ముస్లిం యువతను తప్పుదోవ పట్టిస్తాయని వారు తమ ఫత్వాలో పేర్కొన్నారు. మరోవైపు ఈ పాటకు దేశవ్యాప్తంగా వస్తున్న నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పాటపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ఈ విషయాన్ని ధృవీకరించారు. మరోవైపు ఈ వివాదంపై నోరా ఫతేహీ స్పందిస్తూ.. ఈ పాట హిందీ వెర్షన్‌లో తనకేమీ సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. మూడేళ్ల క్రితం సంజయ్ దత్ వంటి దిగ్గజ నటుడితో కలిసి నటించే అవకాశం రావడం, అలాగే ఇది 'నాయక్ నహీ ఖల్ నాయక్ హూ మై' వంటి ఐకానిక్ సాంగ్ రీమేక్ అని భావించి తాను అంగీకరించానని తెలిపారు. తనకు కన్నడ భాష తెలియదని, మేకర్స్ చెప్పిన అనువాదం అప్పట్లో అభ్యంతరకరంగా అనిపించలేదని ఆమె వివరణ ఇచ్చారు. ధ్రువ సర్జా హీరోగా, ప్రేమ్ దర్శకత్వంలో 1970ల నాటి బెంగళూరు నేపథ్యంతో తెరకెక్కిన 'కేడీ: ద డెవిల్' చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది.